సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 10-1-2025 15/-


# 2024 సంధించిన ప్రశ్నలు






గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 2 హైదరాబాద్
శుక్రవారం 10 జనవరి 2025 రూ.15-00
9 రజబ్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

విశ్వాసి మరొక విశ్వాసికి దర్పణం లాంటివాడు. ఒక విశ్వాసి మరొక విశ్వాసికి సోదరునితో సమానం.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com






## లోపల...


| | | |
|---|---|---|
| మన్మోహన్ | ...... | 04 |
| 2024 సంధించిన ప్రశ్నలు | ...... | 05 |
| ఉద్యమానికి ఊపిరి | ...... | 08 |
| యువతకు సవాళ్ళు | ...... | 13 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| చరితార్థులు–2 : మౌలానా అబ్దుల్ హమీద్ బాఖ్వీ | ...... | 21 |
| పుస్తకమే బెస్ట్ ఫ్రెండ్ | ...... | 22 |
| ఇస్లామీయ ఉద్యమం దాని క్రమ వికాసం – 2 | ...... | 24 |
| నాటి మూలవాసులే నేటి ముస్లిములు | ...... | 26 |
| గొప్ప గురువులే గొప్ప శిష్యులను తయారు చేయగలరు | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| కోపాన్ని జయించి చూడు | ...... | 34 |


**బీరేన్ మొసలి కన్నీరు ...**




మణిపూర్ ప్రజలకు
బీరేన్‌సింగ్ క్షమాపణ
ఇది మొసలి కన్నీరని
ఐనదోయి నిరూపణ!
చిత్తశుద్ధి మాటలేదు
అంతా ఒక బూటకం
ఏందో ఉన్నది పథకం
అందుకే ఈ నాటకం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# మన్మోహన్

డా. మన్మోహన్ సింగ్ డిసెంబర్ 26వ తేదీన మరణించారు. మనిషిగా సౌమ్యుడు, అత్యుత్తముడు, దేశాభిమాని. ప్రజాజీవితంలో ఆయన్ను అప్రతిష్ఠపాలు చేయాలని ప్రయత్నించినవారు, ఆయన్ను పరిహసించిన వారు ఇప్పుడు మరుగుజ్జులుగా కనిపిస్తున్నారు.

మన్మోహన్ సింగ్ 1991లో, పీ.వీ.మంత్రివర్గంలో ఆర్థికమంత్రిగా ఉన్నారు. భారత ఆర్థికవ్యవస్థ తీవ్రమైన ఒడిదుడుకుల్లో పడిన కాలం అది. కువాయిట్ యుద్ధం వల్ల పరిస్థితి మరింత దిగజారింది. తుదకు ఐఎంఎఫ్ వద్ద బంగారం కుదువ పెట్టవలసిన పరిస్థితి వచ్చింది. మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, సరళీకరణలు చాలా ధైర్యంగా తీసుకున్న నిర్ణయాలు. లైసెన్స్ రాజ్ పోయింది. ఒక్క వారంలోనే రూపాయి విలువ చాలా పతనమైంది. విదేశీ పెట్టుబడులు స్వేచ్ఛగా వచ్చే అవకాశం దొరికింది.

ఆ తర్వాత 1996 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెసు ఓడిపోయింది. మన్మోహన్ సింగ్ రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. కాని 2004లో మరోసారి కాంగ్రెసు నాయకత్వంలోని యుపిఏ అధికారంలోకి వచ్చింది. ప్రధాని పదవి పోటీ నుంచి సోనియాగాంధీ తప్పుకోవడమే కాదు మన్మోహన్ సింగ్ ప్రధాని అయ్యారు. ఆ తర్వాత పదిసంవత్సరాల కాలం ప్రధానిగా మన్మోహన్ సింగ్ భారత చిత్రపటాన్ని మార్చేశారు. డాటా చూసినా మన్మోహన్ కాలంలో సాధించిన విజయాలు కనిపిస్తాయి. నిఫ్టి నాలుగింతలు పెరిగింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు శరవేగంగా వచ్చాయి. మూడేళ్ళ పాటు భారతదేశం 9 శాతం ఆర్థికవృద్ధి నమోదు చేసింది.

మన్మోహన్ సింగ్ చాలా ధైర్యంగా నిర్ణయాలు తీసుకున్న ప్రధాని. 2008లో అమెరికాతో అణుఒప్పందం అలాంటి నిర్ణయాల్లో ఒకటి. మిత్రపక్షాలు మద్దతు ఉపసంహరించే ప్రమాదం ఉన్నా ఆయన లెక్కచేయలేదు. కమ్యునిస్టు పార్టీలు సహజంగానే ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆ మరుసటి సంవత్సరమే ఆయన కాంగ్రెసు పార్టీకి ఘనమైన విజయం లభించేలా చేశారు.

ఉపాధి హామీ పథకం మన్రేగా, రైట్ టు ఎడ్యుకేషన్, జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం ఇలాంటివి ఎన్నో.

రాజకీయాల్లో వాస్తవాల కన్నా ప్రచారాలు ఎక్కువగా పనిచేస్తాయి. రకరకాల అవినీతి కుంభకోణాలపై ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ, కొత్తగా ఆందోళనలకు దిగిన పౌరసమాజం మన్మోహన్ సింగ్ ప్రధానిగా గద్దె దిగడానికి ప్రధాన కారణాలు. విచిత్రమేమిటంటే, లోక్‌పాల్ కోసం ఆందోళనకు దిగి, గగ్గోలు చేసిన వారు ఆ తర్వాత లోక్ పాల్ ను పట్టించుకోలేదు. కామన్వెల్త్ స్కామ్, 2జి స్కామ్, కోల్ స్కామ్, వివిధ కుంభకోణాల ఆరోపణలు చేసిన వాళ్ళు అధికారంలోకి వచ్చిన తర్వాత అస్సలు ఆ కుంభకోణాల వార్తలే ప్రజలు మరిచిపోయారు.

ఆర్థిక సంక్షోభకాలంలో సయితం భారత ప్రగతి చక్రాలను పరుగులు పెట్టించిన ప్రధాని మన్మోహన్. అందుకే అమెరికా అధ్యక్షుడిగా ఒబామా ఆయన గురించి "డా.సింగ్ మాట్లాడుతుంటే ప్రపంచం మౌనంగా వింటుంది" అన్నారు.

అబ్దుల్ వాహెద్




# 2024 సంధించిన ప్రశ్నలు

**2024-గడిచిపోయింది.** చరిత్రలో నమోదైపోయింది. 2024వ సంవత్సరం అనేక విధాలుగా గుర్తుండి పోతుంది. భారత రాజ్యాంగం 75 సంవత్సరాలు పూర్తయ్యింది ఈ సంవత్సరమే. రాజ్యాంగం ఎన్నికల సమస్యగా ప్రస్తావనకు వచ్చింది కూడా ఈ సంవత్సరమే. దేశ ప్రధాని అయోధ్య రామ మందిరంలో పూజాదికాలు నిర్వహించిన దృశ్యాలు మీడియాలో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. కులగణన డిమాండ్ బలంగా వినిపించిన సంవత్సరం ఇది. కొన్ని దశాబ్దాలుగా బీజేపీ నడుపు తున్న మతతత్వ రాజకీయాలను సాధారణ ఎన్నికల్లో ఓటర్లు తిప్పికొట్టిన సంవత్సరం కూడా ఇదే. అయోధ్యలో కూడా బీజేపీ బోల్తాపడిన సంవత్సరం ఇది. దేశంలో పేదరికం పెరుగుతూ, సంక్షేమ పథకాల కోసం, రేషన్ బియ్యం కోసం ప్రజలు క్యూ కట్టడం పెరిగిన సంవత్సరం ఇది. డైరెక్ట్ క్యాష్ ట్రాన్స్‌ఫర్లు పెరిగిన సంవత్సరం ఇది.

అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం జరిగిన సంవత్సరం ఇది. ప్రధాని స్వయంగా పాల్గొన్న కార్యక్రమం, అందులో కార్పోరేట్లంతా పాల్గొన్నారు. సాధారణ ఎన్నికల్లో 400 స్థానాలు దాటేస్తామనే నినాదాలు వినిపించాయి. రాజ్యాంగాన్ని మార్చేస్తామనే మాటలు వినిపించిన సంవత్సరం కూడా ఇదే. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిపక్షాలు గొంతు విప్పిన సంవత్సరం ఇది. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను జైల్లో వేసిన సంవత్సరం ఇది. హేమంత్ సోరెన్ తనపై వచ్చిన అవినీతి ఆరోపణలకు ఎన్నికల్లోనే జవాబిచ్చాడు. జార్ఖండ్ ఎన్నికలు అసలు నేత ఎవరో చెప్పాయి. అక్కడ ఆదివాసీ స్థానాల్లో బీజేపీకి భంగపాటు తప్పలేదు. ఇప్పుడు జైలుపాలయిన మరో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విషయానికి వస్తే, 2025లో ఢిల్లీలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఢిల్లీ ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారో వేచి చూడాలి.

కార్పోరేట్ కారణంగా పార్లమెంటు స్తంభించిన పరిస్థితి వచ్చింది కూడా ఈ సంవత్సరమే. అమెరికా కోర్టు భారత కార్పోరేట్ దిగ్గజానికి వ్యతిరేకంగా అరెస్టు ఉత్తర్వులు జారీ చేసింది ఈ సంవత్సరమే. మోస్ట్ ఫేవర్డ్ నేషన్ జాబితా నుంచి భారతదేశాన్ని స్విట్జర్లాండ్ తొలగించింది ఈ సంవత్సరమే.

ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ ఇంటికి ప్రధానమంత్రి వినాయకపూజ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్ళిన సంఘటన జరిగింది ఈ సంవత్సరమే.

ఏది ఏమైనా ప్రస్తుతం కొత్త సంవత్సరం వచ్చింది. కాని కొత్త సంవత్సర వేడుకలు చేసుకునే స్థితిలో ఎందరున్నారు? దేశంలో మూడుకోట్లకు పైబడి యువత నిరుద్యోగులుగా ఉన్నారని, ఇది రికార్డు స్థాయి అని, నిరుద్యోగరేటు కోవిడ్ కాలం కన్నా పెరిగిందని దైనిక్ భాస్కర్ ప్రచురించింది. టాక్సులు పెరుగుతున్నాయి, మరోవైపు విదేశీ రుణం పెరుగుతుంది. ఏక్ హై తో సేఫ్ హై అని ప్రధానమంత్రి నినదించిన సంవత్సరం ఇది. మనం గతంలో విన్న నినాదం వేరు ... హిందూ ముస్లిం సిక్ ఈసాయి భారత్ మేం సబ్ భాయి భాయి ... కాని ఇప్పుడు ఏక్ హై తో సేఫ్ హైం... ఎవరు ఒక్కటవ్వాలి? ఎవరితో ప్రమాదం ఉంది? అనే ప్రశ్నలు వినిపించిన సంవత్సరం ఇదే. గతంలో అయ్యప్పస్వాములు ప్రశాంతచిత్తం కలిగిన వారుగా కనిపించేవారు. ఇప్పుడు ఒక గురువును పట్టుకుని విద్యార్థి కాళ్ళుమొక్కేలా చేయించిన సంఘటన జరిగింది ఈ సంవత్సరమే. ప్రపంచం ఆర్థికసంక్షోభాన్నెదుర్కుంటున్న కాలంలో కూడా దేశఆర్థికవ్యవస్థను పరుగులు పెట్టించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రపంచాన్ని వదిలి వెళ్ళింది ఈ సంవత్సరమే. ఆయన సమాధికి రాజఘాట్‌లో స్థలం కేటాయించలేని దురదృష్ట కర పరిస్థితి కూడా మనం చూశాం.

దేశంలో అల్పసంఖ్యాకులపై దాడులు పెరిగాయన్నది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. స్వయంగా ఒక హైకోర్టు న్యాయమూర్తి ముస్లిం అల్పసంఖ్యాకులపై అనుచిత వ్యాఖ్యలు చేసింది ఈ సంవత్సరమే. ఈ సంవత్సరం వెళుతూ వెళుతూ 29 సంవత్స రాల షాదీన్ అనే ముస్లిం యువకుడి ప్రాణాలు తీసుకువెళ్ళింది. గోవధ సాకుతో మూకహత్యకు గురయ్యాడు. గుండాల గుంపు దాడి చేసి చంపేసింది. ఉత్తరప్రదేశ్ మురాదాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. ఇప్పుడు ఇలాంటి సంఘటనలు వార్తలుగా కూడా ప్రాముఖ్యాన్ని కోల్పోయి, మామూలు సంఘటనలై పోయాయి.

ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉంటే ఆశ్చర్యపోవాలి. ఎందుకంటే, బీజేపీ నాయకులు ముస్లిములపై విషం కక్కుతూ చేసే వ్యాఖ్యలు రోజూ వస్తూనే ఉన్నాయి. బీహార్ బిహ్పూర్ నియోజక వర్గం బీజేపీ ఎమ్మెల్యే శైలేంద్ర మాట్లాడుతూ ముస్లిములు దేశానికి హానికరం అన్నాడు. కుటుంబనియంత్రణ అమలు చేయాలన్నాడు. ముస్లిముల ఓట్లు పొందడం కన్నా ఎన్నికల్లో ఓడిపోవడాన్ని ఇష్టపడతానన్నాడు. ఇదే బీహారులో గాంధీజీ భజన... రఘుపతి రాఘవ రాజారాం... పాడుతున్న గాయని “ఈశ్వర్ అల్లా తేరో నాం” అనగానే ఆ గాయని క్షమా పణలు చెప్పుకోవలసిన పరిస్థితి వచ్చింది. ఈ సంఘటన జరిగింది కూడా ఈ సంవత్సరమే. స్వయంగా బీజేపీ కార్య క్రమంలో, బీజేపీ నేతలతో సన్మానం పొందిన గాయని, వేదికపై గాంధీజీకి ఇష్టమైన భజనలో ఈ పంక్తిపాడగానే భరించలేని అసహనం వెల్లువెత్తిందంటే దేశంలో ఎలాంటి పరిస్థితి ఉందో అర్థం చేసుకోవచ్చు. గాంధీని ద్వేషించేవాళ్ళు, గాడ్సేని ప్రేమించే వాళ్ళు బాహాటంగా తమ వైఖరిని ప్రదర్శించిన సంవత్సరం ఇదే.

జనవరి 22, 2024న దేశంలో రామమందిర ప్రారంభోత్సవం జరిగింది. బాబరీ మస్జిదు క్రింద మందిర చిహ్నాలేవీ దొరకలేదని ఒక సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బాహాటంగానే ప్రకటించిన సంవత్సరం కూడా ఇదే. సుప్రీంకోర్టు తీర్పు న్యాయం చేయలేదని కూడా ఆయన నిర్మొహమాటంగా చెప్పారు.

మస్జిదు క్రింద మందిరాలను వెదికే కార్యక్రమం ఊపందుకుంది కూడా ఈ సంవత్సరమే. ఉత్తరప్రదేశ్ సంభల్ లో షాహీ జామా మస్జిదు క్రింద మందిరం ఉందనే హంగామా జరిగింది. అల్లర్లు జరిగాయి. అమాయకులు మరణించారు. వారణాసిలో జ్ఞానవాపి మస్జిదు, మధురలో షాహీ ఈద్గా, అజ్మీరు దర్గాలతో పాటు బదయూన్, భాగ్పత్, లక్నో, జౌన్ పూర్, ఢిల్లీ ఇలా అనేక చోట్ల మస్జిదుల క్రింద మందిరాల కోసం తవ్వకాల పథకాలు ముందుకు వచ్చింది ఈ సంవత్సరమే. అనేక కేసులు న్యాయ స్థానాల ముందుకు వచ్చాయి.

మీడియా వైఖరిలో కూడా యుటర్న్‌లు కనిపించింది ఈ సంవత్స రమే. సాధారణ ఎన్నికలకు ముందు యావత్తు ప్రధానస్రవంతి మీడియా పాలకపక్షానికి వంతపాడుతూ కనిపించింది. బర్రెలెత్తుకుపోతారు, గొర్రెలెత్తకుపోతారు, మంగళసూత్రాలు లాక్కుంటారు వంటి మాటలు మహానేతలు చెబుతుంటే,

మీడియా ప్రముఖులు ఆ మాటలను సమర్థిస్తూ కార్యక్రమాలు చేసింది ఈ సంవత్సరమే. సాధారణ ఎన్నికల్లో పాలకపక్షం ఎదురుదెబ్బలు తిన్న తర్వాత మీడియా వైఖరి కాస్త మారింది. పాలకపక్షంతో పాటు, ప్రతిపక్షాలకు కూడా కవరేజి ఇవ్వడం మొదలైంది. కాని ఆ తర్వాత హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసు ఓడిపోయింది. బీజేపీ గెలిచింది. అంతే మీడియా మరో యుటర్న్ కొట్టింది. మళ్ళీ మీడియాలో మోడీ జపం, ప్రతిపక్షాలపై విమర్శల హోరు మొదలయ్యింది. ఇప్పుడు 2025లో మళ్ళీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత మీడియా వైఖరి ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పవచ్చు.

2025లో పరిస్థితి ఎలా ఉండొచ్చు. విద్వేష రాజకీయాలు ఈ సంవత్సరం కూడా కొనసాగుతాయా? మహారాష్ట్రలో బీజేపీ మంత్రి నితేష్ రాణా కేరళను మినీ పాకిస్తాన్ అన్నాడంటే ఏమను కోవాలి? రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు టెర్రరిస్టుల సపోర్టు ఉందంటాడు. ఇదేమీ కొత్త కాదు. బీజేపీ నేతలు ఇలాంటి మాటలు చెప్పడం ఎప్పటి నుంచో జరుగుతోంది. ఈ సంవత్సరం ఈ విద్వేషసాగు తగ్గుతుందా? రానున్న మూడు సంవత్సరాల్లో అనేక రాష్ట్రాల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఢిల్లీలో వచ్చే నెలలోనే ఎన్నికలున్నాయి. పశ్చిమబెంగాల్లో ఎన్నికలు జరగవలసి ఉంది. బీహారులో ఈ సంవత్సరం చివరికి ఎన్నికలు జరగవలసి ఉంది. 2027లో ఉత్తరప్రదేశ్ ఎన్నికలున్నాయి. ఇన్ని ఎన్నిక లున్నప్పుడు, ఎన్నికల్లో కేవలం మంగళసూత్రాలు ఎత్తుకుపోతా రనే విద్వేష ప్రచారం, ఏక్ రహేంగే సేఫ్ రహేంగే వంటి నినాదా లతో గెలవవచ్చునుకునే వాతావరణంలో విద్వేషం తగ్గుతుందా?

బీహారులో విద్యార్థులు ఆందోళనలకు దిగారు. పోలీసులు కఠినంగా ఈ ఆందోళనలను అణిచేసే ప్రయత్నాల్లో ఉన్నారు. నితీష్ కుమార్ పరిపాలన ఎంత గొప్పగా ఉందో చెప్పే సంఘటనలివి. ఈ సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్ళించడానికి గొప్పగా ఉపయోగపడే సాధనం విద్వేషం. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నాలు బీజేపీ వ్యూహంలో భాగాలు. ఒకప్పుడు ఆర్జెడీ నితీష్ కుమార్ కలిసి ఉన్నప్పుడు ఈ కూటమి గెలిస్తే పాకిస్తాన్‌లో సంబరాలు జరుపు కుంటారని అమిత్ షా చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకోండి. ఇప్పుడు అదే నితీష్ కుమార్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసి నడుపుతున్నారు. ఇప్పుడు కేరళను అప్రతిష్ఠ పాలు చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. జార్ఖండ్ ఎన్నికల్లో ఏం చెప్పారు? బంగ్లాదేశీ చొరబాటుదారులంటూ ప్రజల్ని భయపెట్టే ప్రయ త్నాలు చేశారు. బీజేపీ ప్రభుత్వంలో ఉండి సాధించిం దేమిటి అనే ప్రశ్న రాకుండా ఈ విద్వేషాన్ని ప్రచారంలో పెట్టి అధికా రాన్ని కాపాడుకునే ప్రయత్నాలు జరుగుతూనే ఉంటా యన్నది స్పష్టం.

కాని ఈ పరిస్థితిని ప్రశ్నిస్తున్న గొంతులు కూడా బలంగానే వినిపిస్తున్నాయి. దిల్జీత్ దోసంజ్ బాలీవుడ్ స్టార్, గాయకుడు. మన్మోహన్ సింగ్ కు తన కార్యక్రమంలో నివాళులర్పించాడు. పెద్ద పెద్ద బాలీవుడ్ స్టార్లు, అమితాబ్, షారుక్, ఆమిర్, సల్మాన్, అక్షయ్ వంటి వాళ్ళు ఒక్క ట్వీటు చేయడానికి కూడా సిద్ధపడని వాతావరణంలో దిల్జిత్ దోసంజ్ ధైర్యంగా మన్మోహన్ సింగ్ గురించి మాట్లాడాడు. కనీసం 2025లో అయినా బాలీవుడ్ ప్రముఖ స్టార్లు వెన్నెముక ఉందని నిరూపించుకుంటారా? మీడియా గురించి చెప్పడానికి ఏముంది?

2024లో ముఖ్యమైన విషయమేమిటంటే, మణిపూర్ ముఖ్య మంత్రి బీరేన్ సింగ్ మణిపూర్ సంఘటనలపై క్షమాపణ కోరుకున్నాడు. ఏడాదిన్నర తర్వాత ... కాని ప్రధాని ఇప్పటి వరకు మణిపూర్ వెళ్ళలేదు. మణిపూర్‌పై పెదవి విప్పలేదు. మణిపూర్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. ఇంత హింస జరిగినా అక్కడ రాష్ట్రపతి పాలన గురించి బీజేపీ మాట్లాడలేదు, కాని పశ్చిమబెంగాల్లో జరిగిన సంఘటనలపై రాష్ట్రపతి పాలన విధించాలంటారు.

ఈ పరిస్థితుల నేపథ్యంలో 2025 నుంచైనా ప్రతిపక్షాలు తమ పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తాయా అన్నది ప్రశ్న. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు మన ముందున్నాయి. ప్రతిపక్షాలు గెలవవలసిన ఎన్నికలను ఓడిపోయాయన్నది స్పష్టం. ప్రజల సమస్యలపై ప్రతిపక్షాలు పోరాడుతాయా? డా. అంబేద్కర్ గురించి హోంమంత్రి వివాదాస్పద వ్యాఖ్య చేసింది కూడా ఈ సంవత్సరమే. ఇలాంటి వ్యాఖ్యలు గతంలో ఎవ్వరు చేసింది లేదు. కాని ఆ వ్యాఖ్యలను సమర్థించడానికి యావత్తు మీడియా రంగంలోకి దిగింది. పైగా రాహుల్ గాంధీపై ప్రాప గాండ మొదలవుతుంది. ప్రతిపక్షాలకు గట్టి సవాళ్ళే ఉన్నాయన్నది నిజం. కాని ప్రతిపక్షాల్లో పోరాటస్ఫూర్తి ఉందా? ✤

# ఉద్యమానికి ఊపిరి

## దైవిక యోచన, దైవారాధన పట్ల మక్కువ

ఉర్దూ మూలం : ముహియుద్దీన్ గాజీ
తెలుగు రూపం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

(గత సంచిక తరువాయి)

దివ్య ఖుర్ఆన్ వచనాలు, సీరత్ పాఠాలు చెప్పేదొక్కటే- దైవ సంస్మరణ (జిక్ర్) లేని సతత సంఘర్షణ, సంఘర్షణ లేని దైవ సంస్మరణ విశ్వాస దృక్కోణంతో ఆరోగ్యవంతమైనవి కావు. దైవ సంస్మరణ నుండి పారిపోవటం కూడా కపటుల లక్షణమే. సత్యాసత్యాల సంఘర్షణలో పాల్గొనకపోవటం కూడా కాపట్యానికి చిహ్నమే. ఒక సాధారణ ముస్లింకు ఇది శోభించదు. ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తల విషయంలోనయితే దీనిని ఊహించనైనా లేము. కపటుల గురించి ఖుర్ఆన్ ఏమంటుందంటే-

"వారు అల్లాహ్‌ను చాలా తక్కువగా స్మరిస్తారు."

*(అన్ నిసా- 142)*

"వారు అతి తక్కువగా యుద్ధ రంగానికి వస్తారు."

*(అల్ అహ్‌జాబ్- 18)*

"ఒకవేళ వారు మీ మధ్యన వున్నా (ఒరిగేదేమీ ఉండదు. ఎందుకంటే) వారు పోరాడేది అంతంత మాత్రమే."

*(అల్ అహ్‌జాబ్- 20)*

## ఇస్లామీయ ఉద్యమానికి రక్షా కవచం దైవ సంస్మరణ

ధార్మిక కార్యకలాపాలలో నిమగ్నులై ఉండేవారు అన్నింటికన్నా అధికంగా భయపడవలసింది ప్రాపంచిక వ్యామోహం గురించే. తాము చేసే సత్కార్యాల వెనుక ప్రాపంచిక ప్రయోజనాలు ఎక్కడ తిష్ఠవేస్తాయోనని వారు భయపడుతూ ఉండాలి. మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఒక పెద్ద ఉపద్రవం గురించి సావధానపరుస్తూ; ప్రజలు పరలోకానికి సంబంధించిన పనులు చేస్తారు. కాని వాటి లక్ష్యం ప్రపంచాన్ని పొందటమై ఉంటే ఆ దౌర్భాగ్యకర స్థితి ఎదురైనట్లేనని అన్నారు. (ముసన్నఫ్ ఇబ్నె అబీ షైబా). దైవ సంస్మరణ పట్ల నిరపేక్షాభావం పొడసూపి నప్పుడు, తమ వ్యక్తిత్వం కారణంగానే ఈ విజయాలు వరించా యన్న భావన జనిస్తుంది. ఆ పరిస్థితి గనక ఉంటే దాని గురించి తప్పక ఆత్మ విమర్శన చేసుకోవాలి.

మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహీ (రహ్మ) గారు జమాఅతె ఇస్లామీ ఆధ్వర్యంలో జరిగిన ఒక సమావేశంలో దైవనామ సంస్మరణ ప్రాముఖ్యతను నొక్కి వక్కాణిస్తూ ఇలా అన్నారు:

**"మనిషి పరిజ్ఞానానికి, మనిషి బుద్ధికి లేదా అతని మనో మస్తిష్కా లకు ఏపాటి వెలుగు ప్రాప్తించినా అది కేవలం దైవ సంస్మరణ ద్వారా మాత్రమే ప్రాప్తమవుతుంది. ఒకవేళ ఇదే గనక లేకుంటే మానవుని మనో జగత్తు అంతా అంధకార బంధురమైపోతుంది. అతను చేసే ప్రతి పని బాహ్యంలో ఎంత సక్రమమైనదిగా అనిపించినా అది సరైనదై ఉండదు. అతని మనసు అతనికి తప్పుడు సలహాలనిస్తుంది. అతని మస్తిష్కం అతనిని పెడదారి పట్టిస్తుంది. అతని కాళ్ళు చేతులు ఏ మార్గంలో, ఏ లక్ష్యం కొరకు కదలినా తప్పుడు పని కొరకే కదులుతాయి. ఆఖరికి**

ఒకవేళ ఎవరయినా ఒక వ్యక్తి ధర్మం (దీన్) పేరుతో కార్యోన్ముఖుడైనా, ధార్మిక పనినే చేసినా, అతని ఆంతర్యంలో దైవ సంస్మరణ లోపిస్తే అతని ఆధ్యాత్మిక కార్యం కూడా ప్రాపంచికమే అయిపోతుంది. మీరు ధార్మిక కార్యం కొరకు నడుం బిగించినప్పటికీ దైవ సంస్మరణ పట్ల నిర్లక్ష్యం వహించినట్లయితే ఆ నిర్లక్ష్యం, అలసత్వం మీ కార్యాన్నంతటినీ చెడగొట్టేయగలదు; ముందున్న ఏ మజిలీలోనయినాసరే షైతాన్ మిమ్మల్ని అపమార్గం పట్టించగలడు. మీరు గనక పొంచివున్న ఈ ప్రమాదం నుండి మిమ్మల్ని సురక్షితంగా ఉంచుకోవాలంటే, మీ ఆంతర్యాలను దైవ సంస్మరణతో ప్రకాశమానంగా ఉంచుకోవటం వినా మార్గాంతరం లేదు. అప్పుడే మీ మనోమస్తిష్కాలు, మీ శరీరావయవాలు సరైన పద్ధతిపై, సరైన దిశలో పని చేస్తాయి." *(జమాఅతె ఇస్లామీ చరిత్ర : ఐదవ భాగం)*

పరలోక సాఫల్యానికి పూచీగా ఉండగల అతి గొప్ప కార్యం ఏదయినా కాగలదంటే అది దేవుని రాయబారిగా వ్యవహరించటం, దైవప్రవక్తల మిషన్‌ను తన జీవిత మిషన్‌గా చేసుకోవటం, దైవధర్మ సంస్థాపనకై పగలంతా తలమునకలై ఉండటం! ఈ పనిని చేసేవారు ఎల్లవేళలా ప్రాపంచిక వ్యామోహం, ప్రాపంచిక కాంక్షల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

కోర్కెల దాహం మా చెడ్డది. అది దొంగచాటుగా ఆంతర్యాలలో చోటు సంపాదించుకుంటుంది.

## విశ్వాసి హెల్ప్‌లైన్ నమాజ్

ఒక సూత్రాన్ని దివ్య ఖుర్ఆన్ స్పష్టపరిచింది. అదేమిటంటే దైవ సహాయాన్ని అర్థించే విధానం నమాజ్ మాత్రమే.

**"సహనం ద్వారా, నమాజు ద్వారా సహాయం పొందండి. నిస్సందేహంగా నమాజు కష్టతరమైన కార్యమే. కాని అల్లాహ్‌కు విధేయులైన దాసులకు అది ఎంతమాత్రం కష్టం కాదు."**

***(అల్ బఖరా : 45)***

**"విశ్వాసులారా! సహనం ద్వారా, నమాజు ద్వారా సహాయం అర్థించండి. సహనం కలవారికి అల్లాహ్ తోడుగా ఉంటాడు."**

***(అల్ బఖరా : 153)***

**మూసా తన జాతి వారితో ఇలా అన్నాడు : "అల్లాహ్‌ను సహాయం కొరకు అర్థించండి, ఓర్పు వహించండి. భూమి అల్లాహ్‌ది, తన దాసులలో తాను కోరిన వారిని ఆయన దానికి వారసులుగా చేస్తాడు. అంతిమ సాఫల్యం అల్లాహ్‌కు భయపడుతూ పనిచేసే వారి కొరకే."** ***(అల్ ఆరాఫ్: 128)***

నమాజ్ దైవ సహాయానికి ఎంత దగ్గర చేస్తుందో, దీనికి సంబంధించిన ఒక ఉదాహరణ క్రింది హదీసులో లభిస్తుంది:

**మహనీయ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రవచించారు: అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు- "ఎవరయినా నా మిత్రునితో శత్రుత్వం వహిస్తే నేనతనిపై యుద్ధ ప్రకటన చేస్తాను. నా దాసుడు ఏ ఏ వస్తువుల ద్వారా నాకు చేరువ అవుతాడో వాటిలో అన్నింటికన్నా ప్రియాతి ప్రియమైన వస్తువు విధులు (ఫరాయెజ్). అదనపు ఆరాధనల ద్వారా (నవాఫిల్ ద్వారా) కూడా నా దాసుడు నాకు దగ్గరవుతాడు. ఆ విధంగా నేనతనిని ప్రేమించసాగుతాను. నేనతనిని ప్రేమిస్తున్నప్పుడు అతను వినే చెవులనైపోతాను. అతను చూసే కంటిచూపునై పోతాను. అతను పట్టుకునే చేతులనైపోతాను. అతను నడిచే కాళ్ళనై పోతాను. అతను నన్ను అడిగితే నేనతనికి తప్పకుండా ఇస్తాను. అతను నా ఆశ్రయాన్ని అర్థించినప్పుడు నేనతనికి తప్పక ఆశ్రయం కల్పిస్తాను."** ***(సహీహ్ బుఖారీ)***

ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలు విధులు (ఫరాయెజ్), అదనపు ఆరాధనల (నవాఫిల్) ద్వారా హదీసులో పేర్కొనబడిన దైవ సామీప్యపు స్థానానికి చేరుకుంటే, వారెంత బలోపేతం అవుతారో ఊహించండి! వారికి దేవుని ఎంత పెద్ద అండ లభిస్తుందో, వారు నడయాడటంలో, వారి దైనందిన కార్యకలాపాలలో దైవ సహాయం ఏ మేరకు ప్రాప్తమవుతుందో ఆలోచించండి!!

## అవసరం మేరకే నిద్రించాలి, రాత్రి జాగరణ పట్ల శ్రద్ధ వహించాలి

అల్లాహ్ పట్ల ప్రేమ, ఆయన సాన్నిధ్యం పొందగోరే వారు అల్లాహ్ విధించిన నమాజులన్నింటినీ శ్రద్ధాసక్తులతో ఆచరించాలి. అల్లాహ్ రేయింబవళ్ళలో ఐదు వేళల నమాజులను విధిగా నిర్ణయించడంతోపాటు రాత్రివేళ చేసే తహజ్జుద్ నమాజును దాసుని అభిరుచికి వదిలేశాడు. తహజ్జుద్ నమాజ్ ఆరాధనల పట్ల దాసుని శ్రద్ధాసక్తులకు, అభిరుచికి పరీక్ష. రాత్రి వేళ చేసే తహజ్జుద్ నమాజులో అసాధారణమైన మాధుర్యం ఉంది. ఆ మాధుర్యాన్ని ఆస్వాదించినవారు, ఇక దానిని వదలరు.

తహజ్జుద్ ఆరాధన ప్రఖ్యాత పరిభాషలో ఫర్జ్ (విధి) కాదు, నఫ్ల్ (స్వచ్ఛందం, అదనం) కూడా కాదు. నిజానికి అది స్వర్గం కొరకు ఆరాటపడే వారి అభిలాష, ఆకాంక్ష. దైవప్రసన్నతా భాగ్యాన్ని పొందే పరుగులో ముందంజ వేయగోరేవాడు తహజ్జుద్ నమాజులను పాటిస్తాడు. ఖుర్ఆన్‌లో అన్నిటికన్నా అధికంగా ప్రస్తావించబడిన నమాజు తహజ్జుద్ నమాజే. ఇస్లామీయ ఉద్యమంతో సంబంధం ఉన్న ప్రతి వ్యక్తీ తహజ్జుద్‌ను పాటించాలి.

అల్లాహ్ రాత్రిని చాలా సుదీర్ఘంగా చేశాడు. అది ఎంత సుదీర్ఘంగా ఉందంటే, దాని ఒక పెద్ద భాగంలో మనిషి హాయిగా నిద్రపోయి, మిగిలిన భాగంలో ప్రశాంతంగా- ఏకాగ్ర చిత్తంతో- దైవారాధన చేయగలడు.

అసలు రాత్రి అనేది రెండు ముఖ్య పనుల కొరకు ఉద్దేశించ బడినది- నిద్ర కొరకు, ఆరాధన కొరకు. శోచనీయమైన విషయ మేమంటే మన రాత్రులలో ఒక పెద్ద భాగం వృథా పనులలో గడిచిపోతుంది. ఇక మిగిలిన భాగం నిద్రకే సరిపోదు.

ఒకవేళ మనిషి రాత్రి తొందరగా నిద్రపోతే చివరి జాములో మేల్కొని ప్రపుల్ల వదనంతో కార్యనిమగ్నుడవుతాడు.

దైవమార్గంలో పగలంతా పనిచేసేవారి కొరకు రాత్రిపూట జాగరణ (ఆధ్యాత్మికత) ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. రాత్రి పూట ఏకాంతంలో చేసే ఆరాధన పగటిపూట చేసే ధార్మిక కార్యక్రమాలకు రక్షణగా ఉంటుంది. ప్రజల ప్రశంసలు, పొగడ్తల వల్ల హృదయంపై పేరుకున్న దుమ్ము ధూళి సాష్టాంగ ప్రణామాల, పశ్చాత్తాప కన్నీళ్ళ ద్వారా తుడిచిపెట్టుకుపోతుంది. మనుషుల మధ్య పనిచేస్తూ ఉన్నప్పుడు పరుల మెప్పు కారణంగా మనసు పొంగిపోయే ప్రమాదముంటుంది. రాత్రిపూట ప్రభువు సమక్షంలో చేసే ప్రార్థనలు మనసుకు అణకువను ప్రసాదిస్తాయి. ఈ ఆత్మ ప్రక్షాళన, అణకువ ఒక సందేశ ప్రదాతకు ఎంతో విలువైన ఆభరణం.

## ఆరంభ శూరత్వం అంత మంచిది కాదు

“రాత్రివేళ (తహజ్జుద్) నమాజును చేయండి, ఒక రకఅత్ అయినా సరే” అని ప్రవక్త మహనీయులు (స) ప్రవచించినట్లుగా ఒక ఉల్లేఖనం ఉంది. కొందరు పరిశోధకులు దీనిని బలహీన ఉల్లేఖనంగా ఖరారు చేశారు. అయితే క్రియాత్మక కోణం నుండి చూస్తే ఈ ఐడియా మంచిదే అనిపిస్తోంది. కొందరికి తహజ్జుద్ నమాజ్ చేయాలన్న కాంక్ష ఉంటుంది. కాని వారికి నిద్రపై అదుపు ఉండదు. అలాంటి వారు ఉషోదయానికి ఓ పదిహేను నిమిషాలు ముందుగా మేల్కొని కనీసం 3 రకతుల నమాజ్ ఆచరించటం మొదలెట్టవచ్చు. క్రమక్రమంగా తొందరగా లేచే అలవాటు అయ్యాక వారు తహజ్జుద్ నమాజ్‌ను పూర్తిగా ఆచరించవచ్చు.

పగటిపూట ఎడతెరిపి లేని వ్యాపకాల వల్ల ఖుర్‌ఆన్ పారాయణం చేసే, ఆ వాక్యాలపై యోచన చేసే తీరిక చిక్కదు. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటంటే ఫజ్ర్‌నమాజ్ కొరకు అజాన్ ఇవ్వబడే క్షణంనుండి సామూహిక నమాజ్ మొదలయ్యేవరకు (15, 20 నిమిషాలు) మస్జిద్‌లోనే గడపాలి. ఆ సమయంలో గ్రంథ పారాయణం చేయాలి లేదా వేడుకోళ్ళలో నిమగ్నం అవ్వాలి. దీని ఆధ్యాత్మిక ఛాయ పగటిపూట పనులపై తప్పక పడుతుంది.

## విధుల నిర్వహణలో అశ్రద్ధ, అలసత్వం కూడదు

ఒక్కోసారి ఏం జరుగుతుందంటే, మనిషి రాత్రిపూట తహజ్జుద్ నమాజును ఎంతో శ్రద్ధతో ఆచరిస్తాడు. ఫజ్ర్ నమాజ్ పట్ల కూడా అతనికి అంతే ఆసక్తి ఉంటుంది. కాని మిగిలిన ఫర్జ్ నమాజుల పట్ల శ్రద్ధ తగ్గిపోతుంది. వాటి నిర్వర్తన లాంఛనప్రాయంగా మాత్రమే ఉండిపోతుంది.

ఫర్జ్ నమాజుల విషయంలో ఎలాంటి రాజీకి తావు లేదు. ఒక విశ్వాసి (మూమిన్) ఫర్జ్ నమాజును వదలిపెడతాడని ఊహించ నైనా లేము. కాకపోతే వాటిని ఆచరించే విషయంలో అశ్రద్ధ, అనాసక్తత తొంగిచూస్తూ ఉంటుంది. స్వచ్ఛమైన దైవదాస్యం వాంఛించేదేమంటే, మనిషి ఫర్జ్ నమాజులను కడు ఏకాగ్రతతో, మనసును దేవుని యందు లగ్నం చేసి మరీ ఆచరించాలి.

నిష్కల్మషమైన ఈ దాస్య భావన తొణికిసలాడాలంటే దాసుడు తొలి వేళలోనే మస్జిద్‌కు చేరుకోవాలి. నమాజ్ మొదలైన తరువాత మస్జిద్‌కు చేరుకునేవారు నమాజు పట్ల తమకు గల అనాసక్తతను వ్యక్తపరుస్తున్నారన్నమాట! ఒకవేళ వారు ఎల్లప్పుడూ ఇలాగే ఆలస్యంగా వస్తున్నట్లయితే వారికి ఇతరత్రా పనులపై ఉన్నంత శ్రద్ధ నమాజు పట్ల లేదనుకోవాలి.

## వేళకు నమాజు చేయాలి

సమావేశం నిర్ధారిత సమయానికి ప్రారంభమవ్వాలి. ఇజ్తెమాలు కూడా నిర్ణయించిన సమయానికి జరగాలి. ఇది సామూహిక నైతికతకు సంబంధించిన తిరుగులేని అంశం. ఇక నమాజు విషయానికి వస్తే, దానిని దాని వేళకు కట్టుబడి ఆచరించాలి.

నమాజు వేళలను దృష్టిలో ఉంచుకుని మరీ మీటింగులను, చిన్న పెద్ద ఇజ్తెమాలను కండక్ట్ చేయాలి. ఈ షెడ్యూలుకు కచ్చితంగా కట్టుబడాలి.

వివిధ కార్యక్రమాల వంకతో నమాజు ఆలస్యంగా చేయటం ఎంతమాత్రం వాంఛనీయం కాదు. ఇతరత్రా పనులను వెనక్కి నెట్టి ముందుగా- వేళకు- నమాజ్ చేయాలి. విశ్వాసం (ఈమాన్) వాంఛించేది ఇదే.

> **మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం ప్రకారం ఒక వ్యక్తి దైవప్రవక్త(స)ను, 'శ్రేష్ఠమైన పనులేవి?' అని ప్రశ్నించాడు. దానికి ఆయన(స) మూడు పనులను మేల్తరమైనవిగా పేర్కొన్నారు: “1) వేళకు నమాజ్ చేయటం 2) తల్లిదండ్రుల పట్ల సద్వ్యవహారం చేయటం 3) దైవమార్గంలో సతత సమరం సాగించటం.”** *(సహీహ్ బుఖారీ)*

ఈ హదీసు ద్వారా ఒకవైపున నమాజ్‌ను వేళకు చేయవలసిన ప్రాముఖ్యత ముందుకు రావటంతోపాటు మరోవైపున దైవాన్ని సంతోషపెట్టాలన్న కాంక్ష కలవారు నమాజ్‌తోపాటు జిహాద్ రంగంలో కూడా ముమ్ముందు ఉంటారని అవగతం అవుతోంది. వారు ఆరాధనాలయంలోనూ, సమర క్షేత్రంలోనూ చిత్తశుద్ధితో దేవుని హక్కులను, దాసుల హక్కులను నెరవేరుస్తారు. మరీ ముఖ్యంగా తల్లిదండ్రుల హక్కులను!

## 'ఇన్ఫాఖ్' (దైవమార్గంలో ఖర్చు) 'నిఫాఖ్' (కాపట్యం) నుండి కాపాడుతుంది

శారీరకమయిన ఆరాధన 'నమాజ్' అయితే, ధనపరమయిన ఆరాధన 'ఇన్‌ఫాఖ్-అంటే దైవమార్గంలో విరివిగా ఖర్చు చేయటం. ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలు ఈ రెండు ఆరాధనలలో కూడా ముందంజ వేసే కాంక్ష కలిగి ఉంటారని ఆశించబడుతోంది.

దివ్య ఖుర్‌ఆన్ దైవ సందేశహరుని (సఅసమ్) ద్వారా ఏ ఉద్యమాన్ని ఉద్భవింపజేసిందో, దానికి సంబంధించిన రెండు విషయాల గురించి చాలా గట్టిగా తాకీదు చేయటం జరిగింది- 1) నమాజ్ 2) దైవమార్గంలోఖర్చు. దైవమార్గంలో మీరు చేసే ఖర్చు మీలోని చిత్తశుద్ధికి, భక్తీతత్పరతకు తార్కాణం. ప్రాపంచిక ప్రయోజనాలను ఆశించి ఉద్యమంలో చేరినవాడు తన విలువైన సంపదను ఉద్యమంలో వెచ్చించడానికి మనస్ఫూర్తిగా ముందుకు రాడు. పైగా ఉద్యమం ద్వారా భౌతిక ప్రయోజనాన్ని పొందగోర్తూ ఉంటాడు.

మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహి (రహ్మ) ఒక ఇజ్తెమాలో చాలా స్పష్టంగా- నిర్దిష్టంగా, నిష్కర్షగా, నిర్మొగమాటంగా- ఇలా అన్నారు:

> **"సంఖ్యాపరంగా మీరు చాలా కొద్దిమందే అయినప్పటికీ, మీ ఆర్థిక పరిస్థితి ఎంతో బలహీనం అయినప్పటికీ, మీరు గనక నిష్కల్మషమైన భావనతో దైవధర్మానికి తోడ్పాటును అందించి నట్లయితే, మీ సంపదలో కూడా శుభం, సమృద్ధి జరుగుతుంది. మీ ఈ సంపద ద్వారా చేపట్టే ఈ కార్యంలో కూడా శుభం ఉంటుంది. ఇదే 'ఇన్‌ఫాఖ్' (దైవమార్గంలో ఖర్చు). ఇది మీలో అల్లాహ్ పట్ల గల నమ్మకాన్ని బలవత్తరం చేస్తుంది. దీని ద్వారా మీరు భవిష్యత్తులో మరిన్ని ఘనకార్యాలు చేయగలరు. ఒక విషయం బాగా గుర్తుంచుకోండి! ఎవరయినాసరే తాము మహదాశయం కొరకు నడుం బిగించామని ప్రకటిస్తూ, దాని కొరకు తమ జేబు నుండి డబ్బు ఖర్చుపెట్టకపోతే, వారు ఖచ్చితంగా కాపట్య (నిఫాఖ్) రోగానికి గురవుతారు. మనలోని ప్రతి ఒక్కరినీ అల్లాహ్ ఈ రోగం నుండి కాపాడాలని ప్రార్థిస్తున్నాను.** *(జమాఅతె ఇస్లామీ చరిత్ర- 5వ భాగం)*

## దైవ చింతన సర్వవిధాలా వ్యక్తం కావాలి

ఇస్లామీయ ఉద్యమ కార్యకలాపాలలో దైవంతో ప్రగాఢ సంబంధం, దైవచింతన రకరకాలుగా ఉట్టిపడుతూ ఉండాలి. ఎందుకంటే ఈ పని అసలు జరిగేదే దైవప్రసన్నతను చూరగొనటం కోసం! దైవిక యోచనను ఉపేక్షించి ఉద్యమ కృషిని కొనసాగించటం నిరర్థకం. దీని ఉపమానం ధనాగారపు తాళం చెవులను ఎక్కడో వదిలేసి వట్టిచేతులతో ధనాగారం వైపునకు పరుగులు తీయటం వంటిదే.

మనుషుల మధ్యన ఉండి పని చేస్తున్నప్పుడు మనసును అల్లాహ్ యందు లగ్నం చేసే బదులు మనుషులపై మనసును కేంద్రీకరించే ప్రమాదం పొంచి ఉంటుంది. అందుకే మాటిమాటికీ దైవిక యోచన, దైవచింతన గురించిన పాఠాలను గుర్తు చేయవలసిన ఆవశ్యకత ఉంది.

ఉదాహరణకు:

1) ప్రతి కార్యక్రమం దైవప్రస్తావనతోనే ఆరంభమవ్వాలి. దైవప్రస్తావనతోనే దాని ముగింపు జరగాలి. ఈ సందర్భంగా అల్లాహ్‌తో మన సంబంధం ప్రగాఢంగా ఉండాలని గుర్తు చేయాలి.
2) ఏ అంశాలు మానవ నైపుణ్యాలతో, అనుభవాలతో ముడిపడి ఉంటాయో, వాటిలో కూడా దైవప్రస్తావన జరగాలి. ఇస్లామ్ జీవితపు సమస్త రంగాలను పరివేష్టించి ఉంది. ఇస్లామ్ దృష్టికోణం నుండి ప్రతి వస్తువు దైవకానుకే. కాబట్టి ప్రతి కార్యక్రమం అల్లాహ్ రంగులో రంగరించబడి ఉండాలి.
3) ఏ అంశంపై చర్చించినా దివ్య ఖుర్‌ఆన్ ఆయత్‌ల ద్వారా మార్గదర్శకత్వం పొందే, హితబోధ గ్రహించే ప్రయత్నం చేయాలి. దైవప్రవక్త(స)పై దురూద్ పంపుతూ ఉండాలి. ఆయన(స) జీవితాన్ని అత్యుత్తమ ఆదర్శంగా పదేపదే సమర్పిస్తూ ఉండాలి.
4) ప్రతి ప్రోగ్రాం ఆరంభంలోనూ, ముగింపులోనూ దుఆలు, వేడుకోళ్ళ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఈ దుఆలు కేవలం లాంఛనప్రాయంగా జరగరాదు, వాటిలో కార్యకర్తలు ఆర్ద్రతతో లీనమైపోవాలి.
5) ఏ సందర్భంలోనయినా సరే మనోవేదనతో కళ్ళ గుండా కన్నీళ్ళు ప్రవహిస్తే వాటిని ఆపకూడదు.
6) ఉద్యమ కార్యకర్తలు పరస్పరం వ్రాసుకునే ఉత్తర ప్రత్యుత్తరాలు, జరిపే సంభాషణలు కూడా దైవిక యోచనతో కూడుకుని ఉండాలి. ఏదో లాంఛన ప్రాయంగా, మొక్కుబడిగా కరస్పాండెన్స్ జరిపే బదులు ఉద్యమ ధ్యేయం,

ప్రధాన లక్ష్యం తొణికిసలాడే పద్ధతిని అవలంబించాలి.

7) అలాగే ఫోన్ ద్వారా జరిపే సంభాషణల్లో కూడా ఉద్యమం గురించి చింతన ఉట్టిపడాలి.

8) ఉద్యమ కార్యకర్తల పరస్పర భేటి ఈమాన్‌ను (విశ్వాసాన్ని) ఉత్తేజపరచేలా ఉండాలి. పరస్పర సమావేశాల ఆధ్యాత్మిక ప్రభావం ఆంతర్యంపై అనేక రోజులపాటు ఉంటుంది.

## శుభప్రదమైన వాతావరణాన్ని సృజించాలి

శుభప్రదమైన వాతావరణం వల్ల కలిగే ప్రయోజనాలు అసంఖ్యాకం. మంచి మాటల్ని వినే, వినిపించే వాతావరణం గనక ఏర్పడితే వాటికి క్రియారూపం ఇవ్వటం సులభతరమవుతుంది. వాతావరణం ఖుద్దుగా స్ఫూర్తిదాయకమై, బోధకునిగా పని చేస్తుంది. ఇస్లామీయ ఉద్యమంలో సాధారణంగా ఆరాధనలు, దైవిక యోచనల వాతావరణం ఉంటుంది. ఒకవేళ అది ఎప్పుడయినా తరుగుతున్నట్లు అనిపిస్తే, దానిని పెంచే ఆచరణాత్మక కృషి చేయాలి.

ఇస్లామీయ చరిత్రలోని వివిధ దశలలో సంస్కరణా ప్రియులు మంచి వాతావరణాన్ని కల్పించటంపై శ్రద్ధ వహించారు. అల్లామా ఇబ్నె జౌజీ నకలు చేసిన ఒక అందమైన ఉదాహరణను ఇక్కడ పొందుపరుస్తున్నాము.

> **తొలికాలపు ఓ మహనీయుడు జమా బిన్ సాలెహ్ మక్కీ గురించి, ఆయన సమకాలికుడు ఖాసిమ్ బిన్ రాషిద్ షైబానీ ఇలా వివరించారు: జమా గారు మా వద్దకు వచ్చి ఆగారు. ఆయన భార్యాబిడ్డలు కూడా ఆయన వెంట ఉన్నారు. ఆయన రాత్రిపూట లేచి చాలాసేపటి వరకు నమాజులో లీనమై ఉండేవారు. రాత్రి చివరి భాగంలో చాలా బిగ్గరగా ఇలా పిలిచేవారు : "ఓ బాటసారులారా! కేవలం రాత్రి గడపటానికి మాత్రమే ఇక్కడ (ఈ ప్రపంచంలో) ఆగండి. ఏమిటి, రాత్రంతా నిద్దరవుతూనే ఉంటారా? ప్రయాణం కొరకు బయల్దేరరా?"**
>
> **ఆ తర్వాత ఏం జరిగేదేమంటే- పరిసరాలలో ఒక వైపు నుండి ఎక్కి ఎక్కి ఏడ్చే శబ్దం వినవచ్చేది. ఒకవైపు నుండి ఆరాధనలు, వేడుకోళ్ళ ధ్వని ప్రతిధ్వనించేది. ఒకవైపు నుండి ఖుర్ఆన్ పారాయణం వినిపించేది. కొందరు వుజూ చేస్తూ కనిపించేవారు. ఉషోదయం అవుతుండగా మరోసారి ఇలా నినదించేవారు : తెల్లవారక ముందే ప్రయాణానికి బయలుదేరిన వారిని చూసి కించిత్ ఈర్ష్య (రష్క్) కలుగుతోంది."** ***(అల్ ముంతజిమ్ ఫీ తారీఖుల్ ములూక్ వల్ ఉమమ్)***

ఈ ఉపమానం ఎంతో అర్థవంతమైనది. గమ్యాన్ని చేరుకోవాలన్న ఆరాటం ఉన్నవారు సూర్యోదయం అయ్యేవరకు నిద్రిస్తూ ఉండరు; తెలతెలవారుతుండగానే ప్రయాణం చేస్తారు. ఎండ తీవ్రత పెరగకముందే వీలైనంత ఎక్కువ దూరం పయనించాలన్నది వారి లక్ష్యమై ఉంటుంది. అలాగే స్వర్గం వరకు చేరుకోవాలన్న ఆరాటం ఉన్నవారు రాత్రి చివరి భాగంలోనే- స్వర్గం వైపునకు బయలుదేర్తారు. సూర్యోదయం అయ్యేటప్పటికే వారు చాలాదూరం ముందుకు వెళ్ళిపోతారు.

## జమాఅతె ఇస్లామీ రూపకల్పన: దాని విశ్వాస భరితమైన దృశ్యం

జమాఅతె ఇస్లామీని స్థాపించినవారు, ఆరంభంలోనే దాని కార్యకలాపాలపై దైవిక యోచన, దైవచింతనల రంగు ఆవరించి ఉండేలా జాగ్రత్త వహించారు. జమాఅతె ఇస్లామీ రూపకల్పనకు సంబంధించిన ఈ రమణీయమైన దృశ్యం తదేకంగా తిలకించ దగినది-

> **అందరికన్నా ముందు మౌదూది గారు (రహ్మ) లేచి సాక్ష్య వచనం (కలిమయె షహాదా) "అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్" పునరుద్ఘాటించారు. తరువాత ఇలా అన్నారు: "మీరు సాక్షులుగా ఉండండి. ఈ రోజు నేను సరికొత్తగా విశ్వాసం స్వీకరిస్తున్నాను. జమాఅతె ఇస్లామీలో ప్రవేశిస్తున్నాను". ఆ తరువాత ముహమ్మద్ మన్జూర్ నోమానీ గారు (రహ్మ) నిలబడి, ఆయన కూడా మౌదూది గారిలానే తన విశ్వాస పునరుద్ధరణ ప్రకటన చేశారు. అలా సభికుల్లో ఒక్కొక్కరు లేచి సాక్ష్య వచనం పఠించి జమాఅతె ఇస్లామీలో చేరారు. చాలామంది సభికుల కళ్ళల్లో నుంచి కన్నీటి ధార ప్రవహిస్తోంది. దాదాపు ప్రతి వ్యక్తీ సాక్ష్యవచనం పఠిస్తున్నప్పుడు బాధ్యతా భావంతో నిలువెల్లా కంపించి పోతున్నాడు. అందరి సాక్ష్యం (షహాదత్) పూర్తయ్యాక మౌదూది గారు, 'ఇప్పుడు జమాఅతె ఇస్లామీ స్థాపన జరిగింది' అని ప్రకటించారు. రండి, మనమం దరం కలసి సర్వలోకాల ప్రభువు సమక్షంలో వేడుకుందాము, ఆయన మన జమాఅత్‌కు స్థిరత్వాన్ని, నిలకడను, పటిష్టతను ప్రసాదించుగాక! తన గ్రంథం, తన ప్రవక్త(స) విధానం ప్రకారం నడుచుకునే సద్బుద్ధిని మనకు ప్రసాదించుగాక!" అని పలికారు. ఈ దుఆకు ముందు మౌదూదీ (రహ్మ) గారు ఇస్లామీయ జమాఅత్ స్థాయి, దాని ప్రణాళిక, లక్ష్యం గురించి మరోసారి విశదీకరించారు. సభికుల్ని ఉద్దేశించి, ఈనాడు వారు ఎంత గొప్ప ప్రతిజ్ఞ చేశారో, దాన్ని ఎలా నిర్వర్తించాలో సావధానపరిచారు. ఆ తరువాత మన్జూర్ నోమానీ గారు (రహ్మ) దుఆ చేయటం ప్రారంభించారు. చాలాసేపటి వరకు సభికులు దైవ సన్నిధిలో విలపిస్తూనే ఉన్నారు."**
>
> ***(జమాఅతె ఇస్లామీ హింద్ చరిత్ర- మొదటి భాగం)***

ఈ దృశ్యం ఇస్లామీయ ఉద్యమానికి ఊపిరి వంటిది. ఇది అమూల్యమైన మూలధనం కూడా. దీనిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి.

**(సమాప్తం)**




ఈ ఇంటర్నెట్ యుగంలో యువత వ్యసనాలకు గురయ్యే అవకాశాలు పెరిగాయి. లైంగిక కోరికలను ప్రేరేపించే, ఆలోచనల్ని విషపూరితం చేసే వాతావరణం పెరిగి పోయింది. లైంగిక ఉద్రేకాలను రెచ్చగొట్టడం, ఆలోచనల్ని పెడదోవ పట్టించడం ఇవి రెండూ షైతాను పన్నాగాలు. ఇవి విశ్వాసాన్ని ప్రమాదంలో పడేస్తాయి. షైతాను మనిషి బహిరంగ శత్రువు. ముస్లిం యువత అల్లాహ్ స్మరణ మరచిపోయేలా చేస్తాడు. దీంతో అల్లాహ్‌తో సంబంధం బలహీనపడుతుంది. అల్లాహ్‌తో సంబంధం కోల్పోయినప్పుడు, షైతాను సులభంగా యువతను తన వలలో వేసుకుంటాడు.

### యువతను సులభంగా ఓడిస్తున్న షైతాను

షైతాను మొదట యువతను కోరికలకు, వ్యసనాలకు బానిసలుగా చేసేందుకు ప్రయత్నిస్తాడు. అల్లాహ్ స్మరణ గురించి పట్టించుకోని యువకులపై షైతాన్ తన మొదటి దాడిలో సులభంగా విజయం సాధిస్తాడు. తమ కోరికలకు బానిసలుగా మారిన యువతను షైతాను చాలా సులభంగా ఓడిస్తాడు. ఇస్లాంపై లేనిపోని అనుమానాలు, అపోహలు సృష్టించే ఎత్తుగడను పారిస్తాడు. అల్లాహ్ సంబంధాన్ని కోల్పోయిన వారు ఈ ఎత్తుగడకు బలవుతారు.

ఇస్లామ్ విరోధులు కొత్త అభ్యంతరాల ద్వారా ఇస్లాం ప్రతిష్టను దెబ్బ తీయడానికి విఫలయత్నం చేస్తుంటారు. ఇది యువత హృదయాలలో లేనిపోని అపోహలను, అపార్థాలను సృష్టిస్తుంది. ఇస్లామీయ సంస్థలతో అనుసంధానం కలిగిన యువ పండితులు, ఈ అభ్యంతరాలకు సకాలంలో ప్రతిస్పందన పొందుతారు. ఇది వారి విశ్వాసాన్ని బలపరుస్తుంది. అయితే అల్లాహ్‌ను స్మరించడాన్ని పట్టించుకోని, సజ్జనుల సాంగత్యానికి దూరమైన యువకులు ఈ అపోహలు, అనుమానాల బారినపడి విశ్వాసాన్ని కోల్పోతారు.

### యువతకు పెద్ద ముప్పుగా మారిన కొన్ని అంశాలను పరిశీలిద్దాం

ఈ యుగంలో అతిపెద్ద సవాల్ సోషల్ మీడియాలో చూపించే నగ్న చిత్రాలు, పోర్న్ సినిమాలు, ఇవి యువతను అపమార్గం పట్టిస్తున్నాయి. ఈ ఇంటర్నెట్ యుగంలో, ఎంటర్‌టైన్‌మెంట్, వినోదం, అత్యంత ఉచితంగా, సులభంగా అందుబాటులోకి వచ్చాయి.

### 1) షైతాన్ మెగా ప్రాజెక్టు.. అశ్లీల కంటెంట్

2023లో ప్రపంచవ్యాప్తంగా పోర్న్ పరిశ్రమ మొత్తం విలువ 173 బిలియన్ డాలర్లు. ఇది 2030 నాటికి 248 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఇది షైతాను మెగా ప్రాజెక్ట్. దీని ద్వారా మానవులు నరకాగ్నికి ఆహూతి అవుతున్నారు. దురదృష్టవ

శాత్తు, ముస్లిం యువకులు కూడా ఈ వ్యసనంలో పడిపోయారు. దీని ప్రభావాలు శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలను చూపుతాయి. వైవాహిక జీవితానికి తీవ్ర ముప్పు కలిగిస్తాయి. వారు తమ చదువులు లేదా వృత్తిపై దృష్టి పెట్టలేరు. దీని కారణంగా వారి ఆర్థిక జీవితం కూడా ప్రభావితమవుతుంది.

## 2) పరీక్ష.. శిక్ష...

ప్రజలు నిర్భయంగా అల్లాహ్‌కు అవిధేయత చూపడం, అంతరాత్మ వల్ల కలిగే పశ్చాతాపాన్ని అణచి వేసినప్పుడు, అల్లాహ్ వారిని ఈ ప్రపంచంలో కూడా శిక్షిస్తాడు. అలాంటి వారు పాపాలు నిత్య కృత్యంగా చేస్తారు. ఈ రోజుల్లో ఉచితంగా పోర్న్ సినిమాలు చూడటం సులభతరమైంది. ఇది ఆధునిక కాలంలో అతిపెద్ద పరీక్ష. అశ్లీల చూపుకు దూరంగా ఉండటమే ప్రస్తుతం యువత ముందున్న అతిపెద్ద సవాలు. కళ్లు మానవ శరీరంలో సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ గొప్ప బహుమానం. కాసేపు కళ్లు మూసుకుని ఉండండి అప్పుడు తెలుస్తుంది, అంధులు ఎంతటి గొప్ప బహుమానాన్ని కోల్పోతున్నారో. అల్లాహ్ అందించిన అనుగ్రహాలకు గాను మనం అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపాలి. సృష్టికర్త ఇష్టానికి అనుగుణంగా జీవితం గడపడమే మనం చెల్లించే కృతజ్ఞత. జీవితం అల్లాహ్ ప్రసాదించిన గొప్ప అనుగ్రహం, అల్లాహ్ చిత్తానికి అనుగుణంగా మొత్తం జీవితాన్ని గడపాలి. అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలపాలి. మేధస్సు, మనస్సు ఇవి రెండూ అల్లాహ్ అనుగ్రహాలు. వీటిని ఉపయోగించి అల్లాహ్ సృష్టి గురించి యోచించాలి. అల్లాహ్‌ను గుర్తించే నిజమైన జ్ఞానాన్ని పొందాలి. ప్రపంచంలో మంచిని ఎలా వ్యాప్తి చేయాలి, చెడును ఎలా నివారించాలి అనే విషయాలలో మీ తెలివికి పదును పెట్టండి. అల్లాహ్ ఆజ్ఞలు, పాటించడం ద్వారా మానవుల సాఫల్యానికి హామీ ఇవ్వబడుతుంది. చెడు చూడవద్దన్న అల్లాహ్ ఆజ్ఞను తూ.చ. తప్పకుండా పాటించాలి. విశ్వాసులు తమ చూపులను కాపాడుకోవాలని ఆజ్ఞాపించబడ్డారు. కానీ నేడు, ఇంటర్నెట్ యుగంలో అన్ని పరిమితులు దాటబడ్డాయి. అశ్లీలం విషయంలో ఎంతగా బరితెగిస్తాడో అంతే అల్లాహ్ ఆగ్రహానికి గురవుతాడు.

## 3) లక్ష్య రహితం

యువకులు లక్ష్యం లేకుండా జీవితం గడుపుతున్నారు. పరలోక జీవిత లక్ష్యం అటుంచితే ప్రాపంచిక లక్ష్యాలూ లేకుండా బతుకుతున్నారు. ఏదో మొక్కుబడిగానే పాఠశాలకు, కళాశాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారు. అందువల్ల పాఠశాల స్థాయిలో 20 శాతం, కళాశాల స్థాయిలో 10 శాతం మంది విద్యార్థులు డ్రాపౌట్స్‌తో బాధపడుతున్నారు. చదువుల్లో ఆసక్తి లేకపోవడం వల్ల పరీక్షల్లో ఫెయిల్ అవుతూ మళ్లీ మళ్లీ పరీక్ష రాస్తున్నారు. సోమరితనం, ఆసక్తి లేకపోవడం, వాయిదా మనస్తత్వం ముస్లిం యువతలో సర్వ సాధారణమైపోయాయి.

## 4) సమయం వృథా

గంటల తరబడి స్నేహితులతో కబుర్లు చెప్పుకోవడం అలవాటైంది. సాధారణంగా వారు హోటళ్లలో కబుర్లు చెప్పుకుంటూ రాత్రి ఆలస్యంగా నిద్రపోతారు. దీని కారణంగా వారు ఉదయం ఆలస్యంగా మేల్కొంటారు. దీంతో తరచుగా కళాశాలకు హాజరు కాలేకపోతున్నారు. అర్ధరాత్రి దాకా తెరిచి ఉండే హోటళ్లలో సంచరించే విద్యార్థులు ఉంటారు. వారు విలువైన సమయాన్ని హోటళ్లలోనే గడుపుతున్నారు, వృథాగా ఖర్చు చేస్తున్నారు. అనవసరంగా ఆకలి లేకుండానే తింటారు. ఈ విధంగా, తినే వ్యసనానికి గురవుతున్నారు.

## 5) ఆధునిక కాలంలో విడాకుల ప్రాబల్యం

ముఖ్యంగా పెళ్లయిన ఒకటి లేదా రెండు సంవత్సరాల తర్వాత విడాకులు రావడం మొదలవుతుంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి: కనీసం పది శాతం విడాకులు అక్రమ సంబంధాల కారణంగానే జరుగుతున్నాయి. అమ్మాయిలో ఓర్పు, తగిన శిక్షణ లేకపోవడం మరో కారణం. మూడవ కారణం అత్తమామల వేధింపులు, వారి అనవసరమైన జోక్యం.

## 6) ప్రేమ వివాహాలు

ముఖ్యంగా ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సంపాదించాలని భావించే అమ్మాయిలు తమ ఆఫీసు లోపల అబ్బాయిలతో స్నేహం ఏర్పడి అది ప్రేమగా మారుతుంది.

### నివారణ:

1) ఇస్లాం జీవితపు అత్యున్నత లక్ష్యాన్ని నిర్వచిస్తుంది:

ఇస్లాం మనిషిని అతని సృష్టికర్తకు పూర్తిగా పరిచయం చేస్తుంది. అత్యున్నత లక్షణాలను వివరిస్తుంది.



ఇది సృష్టి ఉద్దేశాన్ని మనిషికి తెలియజేస్తుంది. మనిషిని పరీక్ష కోసం సృష్టించినట్లు వివరిస్తుంది. ఈ జీవితం తాత్కాలికమైనది. ఈ జీవితమనే పరీక్ష ఫలితం మరణం తర్వాత శాశ్వతమైన జీవితం స్వర్గంలో ప్రతిఫలం లభిస్తుంది. ఖురాన్ ఈ వాస్తవాలను పదేపదే గుర్తుచేస్తుంది, తద్వారా తాత్కాలిక జీవితపు తళుకు బెళుకులకు మోసపోకుండా ఉండేందుకు.

అల్లాహ్ సందేశాన్ని ప్రపంచానికి తెలియజేయడం ముస్లిముల కర్తవ్యమని ఖురాన్ పేర్కొంటుంది. మంచిని ప్రచారం చేయడం చెడును తుంచడం, ముస్లిమ్ సమాజ ప్రధాన ఉద్దేశం. ప్రతి ముస్లిం తన సామర్థ్యాలను, సంపదను ఈ మహత్తర కార్యానికి వెచ్చించాలి.

### 2) షైతాను ఆధిపత్యం నుంచి విముక్తి:

ఒక వ్యక్తి అల్లాహ్‌తో బలమైన ఆధ్యాత్మిక సంబంధాన్ని కలిగి ఉన్నప్పుడే షైతాను ఆధిపత్యం నుండి విముక్తి సాధ్యమవుతుంది. ఒక వ్యక్తి అల్లాహ్, షైతాను ఇద్దరికీ ఒకేసారి లోబడి ఉండటం సాధ్యం కాదు. అల్లాహ్‌తో సంబంధం తెగిపోయినప్పుడు, షైతాను తన ఆధీనంలోకి తీసుకుంటాడు. అల్లాహ్ ఏమంటాడంటే: "విశ్వసించిన ప్రజలారా! మీరు పూర్తిగా ఇస్లామ్‌లో ప్రవేశించండి. షైతాను అడుగుజాడలు తొక్కకండి. అతడు మీకు బహిరంగ శత్రువు. మీ వద్దకు వచ్చిన స్పష్టమైన హితోపదేశాలను మీరు స్వీకరించిన తరువాత మళ్లీ తప్పటడుగు వేస్తే, అల్లాహ్ సర్వ శక్తిమంతుడూ, సర్వజ్ఞుడూ అనే విషయం బాగా తెలుసుకోండి. (సూరత్ అల్-బఖరా: 208)

### 3) అల్లాహ్‌తో సంబంధం:

ఖురాన్ పారాయణం., నమాజును స్థాపించడం ద్వారా అల్లాహ్ తాలాతో బలమైన సంబంధం ఏర్పడుతుంది. నమాజు అశ్లీలత, చెడు పనుల నుండి నిరోధిస్తుంది. ఖురాన్ పఠనం విశ్వాసాన్ని పెంచుతుంది. ఖురాన్ పఠనం, నమాజు స్థాపన ఇవి రెండూ మానవుడు సృష్టికర్తతో కనెక్ట్ అయ్యే సాధనాలు. షైతాను ప్రభావం నుండి రక్షించబడతాడు.

### 4) సజ్జనులతో సహవాసం:

యువత తమ విశ్వాసాన్ని కాపాడేందుకు నీతివంతమైన సాంగత్యం చాలా ముఖ్యం. మంచి మిత్రుడు పరిమళం వంటివాడు, అతడి సహవాసం సువాసనను తెస్తుంది.

### 5) తల్లిదండ్రుల బాధ్యత:

పిల్లలకు చదువుతో పాటు సుశిక్షణ ఇవ్వడం తల్లిదండ్రుల ప్రాథమిక బాధ్యత. వారి హృదయాలలో అల్లాహ్ పట్ల ప్రేమ, పరలోక భయాన్ని నాటాలి. పెళ్లీడుకొచ్చిన పిల్లల వివాహాన్ని ఆలస్యం చేయవద్దు, మొబైల్ ఫోన్ల హానికరమైన ప్రభావాల నుండి పిల్లలను రక్షించండి. ఇస్లామిక్ పుస్తకాలను చదవడం అలవాటు చేయండి. తమ పిల్లలు సత్కార్యాలను అనుసరించేందుకు తల్లిదండ్రులే రోల్ మోడల్‌గా ఉండాలి.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




**ప్రజలు పరస్పరం కలసిమెలసి ఉండటం, పరస్పర సంబంధాలను సరైన, సవ్యమైన రీతిలో ఉంచుకోవటం అనేది మానవ సమాజానికి అత్యంతావసరం.** కాని నేటి ఆధునిక ప్రజలు అభివృద్ధి పథంలో, వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో దూసుకుపోతున్నారు. ఇంకా వారు పెద్దపెద్ద నగరాలలోని ఎత్తైన భవనాలలో నివసించటం ప్రారంభిం చారు. ఇదంతా చూస్తూ ఉంటే ఒకవైపు వారు అభివృద్ధి పథంలో ఎత్తైన శిఖరాలకు చేరుకుంటూ ఉన్నారని సంతోషం కలిగినా తన తోటి ప్రజలతో వారు దూరమైపోతున్నారనే విషయం బాధకు గురిచేస్తూ ఉంది.

ప్రజలందరూ నేటికాలంలో విద్యా సంస్థలలోనూ, కార్యాలయాల్లోను, వాణిజ్య రంగాలలోనూ, స్నేహితులతోనూ అత్యధిక సమయాన్ని ఇట్టే గడిపేస్తున్నారు. దీని కారణంగా తన ఇంటి వారితో, తన బంధువులతో సమయాన్ని వెచ్చించలేక పోతున్నారు. ఇంకా తన పొరుగువాని ముఖాన్ని ఒక్కసారి కూడా చూడని పరిస్థితి, మాట్లాడని పరిస్థితి కూడా చాలాచోట్ల ఏర్పడుతోంది. వారు తమ తమ రంగాలలో అభివృద్ధి కోసం స్నేహ వాతావరణాన్ని కలిగి ఉండటం ఎంత ప్రాముఖ్యమో తెలుసుకున్న తరువాత కూడా తమ ఇంటి వారితో తమ బంధువులతో, తమ పొరుగువారితో అలాంటి స్నేహ సంబంధాలే ఉండాలనే అవసరాన్ని వారు గమనించలేకపోతున్నారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగినట్లయితే దాని పర్యవసానం చాలా గంభీరంగా ఉండటం ఖాయం. మనిషి సామాజిక జీవి. అతని పుట్టుక నుంచి అంతం వరకు ఏర్పడే సంబంధాలన్నింటినీ సరైన రీతిలో కొనసాగించటం తప్పనిసరి. కనుక ఆ సంబంధాలను ఎలా కాపాడుకోవాలో ప్రతి మనిషి తప్పకుండా తెలుసుకోవాలి.

ఇస్లామ్ బోధనల ప్రకారం సంబంధాల రక్షణ మూలం ఏమిటంటే ఇతరుల మేలును కోరటం, వారిని సరైన మార్గం వైపునకు పిలవటం. మనందరి ప్రభువైన అల్లాహ్ మనందరి మేలును కోరుతాడు. మనం సుఖశాంతులతో జీవితం గడపాలని ఆశిస్తాడు. సమాజంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరుతాడు. సమాజంలోని అందరూ సోదరభావం కలిగి ఉండాలని, పరస్పరం సహాయ సహకారాలు అందించుకోవాలని బోధిస్తాడు. తన దాసులకు ఈ విషయాలను బోధించేందుకు ఆయన ప్రవక్తలను ప్రభవింప జేశాడు. ఆ ప్రవక్తలు ప్రభువు మాటలు సత్యమని, ఆ మాటలను అనుసరించటం కష్టమైనవేమీ కావని వాటిని ఆచరించి చూపారు. ఈనాడు మనం కూడా ఆ నిజ విషయాలను విశ్వసించి ఆచరించి సోదరభావాన్ని సత్సమాజ వాతావరణాన్ని నెలకొల్పవచ్చు. ఈనాడు మనం మన వద్ద సమయం లేదని కుంటిసాకులు అబద్ధమని నిరూపించవచ్చు. ఎందుకంటే ప్రవక్తల మీద ఉండే బాధ్యతలను గనక చూస్తే వారి బాధ్యతల్లోని పావువంతు బాధ్యతలు కూడా మనపై లేవు. అల్లాహ్ వారికిచ్చిన సమయాన్ని వారు సరైన రీతిలో విభజించుకునేవారు, సద్వినియోగపరచుకునేవారు. వారికిచ్చిన

జీవిత కాలం చివరి నిమిషాన్ని సైతం చక్కగా వినియోగించు కున్నారు. సఫలీకృతులయ్యారు. కనుక మనం కూడా వాటిని సాధ్యం చేసుకోవచ్చు.

**మొట్టమొదటిది : సత్సంబంధాల కోసం కృషి చెయ్యటం.** తన తోటివారితో సంబంధాన్ని ఏర్పరచుకోవటం అనేది అకస్మాత్తుగా జరిగే పని ఎంతమాత్రం కాదు. ఇంకా కృషి చెయ్యకుండా ఏర్పడేది అంతకన్నా కాదు. కాని కృషితో ఇది తప్పకుండా సాధ్యమవుతుంది. ఎందుకంటే స్నేహం చెయ్యటం అనేది మనిషి తత్వంలో ఉండే గుణం. ఉదాహరణకు, ఏనాడు ఎలాంటి పరిచయం లేని ఇద్దరు పిల్లలను ఒకచోట కూర్చొబెట్టండి. కొంత సమయం కాకుండానే వారు ఎవరు, ఏమిటి అని చూడకుండానే ఒకరివైపు ఒకరు చూసుకుంటారు. నవ్వుకుంటారు. స్నేహ హస్తాన్ని అందిస్తారు. కలిసి మెలసి ఆడుకుంటారు. దీనిద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, ఇది కృషితో మొదలయ్యేది, నీతి నిజాయితీతో నిలకడగా ఉండేది, త్యాగాలతో ఎక్కువ కాలం సాగేది అని.

**రెండోది : సంబంధాల ప్రయోజనం.** చాలామంది ఎవరితోనైనా ఏదైనా సంబంధాన్ని కలిగి ఉన్నట్లయితే వారి ద్వారా మనకు ప్రయోజనం ఏమిటి అని ఆలోచిస్తారు. ఆ సంబంధాన్ని ఆరితేరి చూసి తనకు కావలసిన ప్రయోజనాన్ని పొందే ప్రయత్నంచేస్తారు. ఇలాంటి వారు నిజమైన స్నేహితులు, సంబంధీకులు ఎంతమాత్రమూ కాదు. అలాంటి వారు బాహ్య ప్రయోజనాలను స్నేహితులతో పొంది వారిని ఒంటరిగా వదిలివేస్తారు. అసలైన స్నేహితులు, బంధువులు ఎవరంటే బాహ్య విషయాలను చూడకుండా ఎదుటివారిలో ఉన్న సుగుణాలను వారి నైపుణ్యాలను చూసి స్నేహం చేసేవారు, సంబంధాలను గౌరవించేవారు. వారికి చేదోడు వాదోడుగా ఉంటూ వారి నుంచి మంచి విషయాలను నేర్చుకుంటూ బంధాన్ని కొనసాగించేవారు.

**మూడోది : అనవసరంగా ఇతరుల వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లకూడదు.** ప్రతి మనిషి తన వ్యక్తిగత విషయాలను గోప్యంగా ఉంచుకోదలిస్తే వారికి ఆ హక్కును ప్రసాదించబడింది. స్నేహం ఉందని, బంధుత్వం ఉందని వారి వ్యక్తిగత రహస్య విషయాల కూపీలు లాగకూడదు. అనవసరమైన సలహాలు వారు అడగకుండా వారికి ఇవ్వకూడదు. అది వారికి ఎంతగా ప్రయోజనం చేకూర్చుతాయని భావించినా సరే. ఒకవేళ వారు తమ వ్యక్తిగత విషయాల సమస్యలలో సలహాలు అడిగితే తప్పకుండా సలహాలు ఇవ్వవచ్చు. సహాయమూ చెయ్యవచ్చు. ఈ విధంగా జాగ్రత్తగా ఉంటూ సంబంధాలు కొనసాగించాలి.

**నాలుగోది : మన్నించటం.** వారి తప్పులను చూసీచూడకుండా తన దృష్టిని మరల్చుకోవటం. అంటే దీని అర్థం వారు బాధ పెట్టినందుకు క్షమాభిక్ష పెట్టడం కాదు. సంబంధాల కారణంగా జరిగే తప్పులను, కష్టాలను, నష్టాలను ఎత్తి చూపకుండా చూసీ చూడనట్లుగా వదిలి వేసి సంబంధాలను ముందుకు నడపటం. దీనిద్వారా ఇద్దరికీ లభించే ప్రయోజనం ఏమిటంటే ఎదుటివారి తప్పులు, కష్టాలు, నష్టాల ద్వారా జరిగిన భూతకాల అనుభవాలతో బాధకు గురికాకుండా ఆ బాధలోనే కూరుకుని పోకుండా రక్షణ పొందటం జరుగుతుంది. సంబంధం పదికాలాల వరకు మనగలుగుతుంది.

**ఐదోది : మార్పులు చేర్పులు జరగటం.** విజయాలు లభించడం అనేది సత్యమైన విషయం. సమయం గడుస్తున్న కొద్దీ మనిషి వయసు, అవసరాలు, లక్ష్యాలు మార్పుకు గురవుతూ ఉంటాయి. దాని కారణంగా బంధాలు కూడా ఒడిదొడుకులకు గురవుతూ ఉంటాయి. ఎదుటివారు నీవు మునుపటిలా లేవు. నీ స్నేహం, నీ బంధం మునుపటి స్నేహం, మునుపటి బంధంలా లేవు అని చికాకు పడుతూ ఉంటారు. ఇలాంటి మాటలను సత్యాలని స్వీకరిస్తూ వారితో నిజాయితీగా, విశ్వాసంగా ఉండే ప్రయత్నం చెయ్యాలి. సంబంధాలను, బంధుత్వాలను కాపాడుకోవటానికి సాధ్యపడేంత వరకు వారిలో కలుగుతున్న భావాలను, అర్థం చేసుకుంటూ వారి బాధను తగ్గించే ప్రయత్నం చెయ్యాలి. వారికి లభించే విజయాల పట్ల సంతోషాన్ని వ్యక్తం చెయ్యాలి.

**ఆరోది : తన కోసం తాను చిత్తశుద్ధితో ఉండాలి.** ఎవరైతే తన పట్ల తాను చిత్తశుద్ధిగా ఉండడో, అతను ఇతరుల పట్ల కూడా చిత్తశుద్ధితో ఉండజాలడు. ఇతరులెవ్వరూ తనను సన్మార్గంపై బలవంతంగా నడపజాలరు. మార్గభ్రష్టత్వానికి గురైన వారు తన నష్టానికి తానే బాధ్యుడు. ఈ సత్య విషయం పట్ల తన దృష్టిని మరల్చకూడదు. ప్రతిసారి ఇతరులతో తన విషయంలో మంచిని ఆశించటం, తన బలహీనతల బాధ్యత కూడా ఇతరులపై వేయటం మంచి విషయం ఎంతమాత్రం కాదు. తన పట్ల చిత్తశుద్ధి తనతోనే ప్రారంభించాలి. ఆ తరువాత ఇతరులలో కూడా ఆశించాలి.

**ఏడోది : ప్రేమామృత హృదయం, జాలి మనసు కలిగి ఉండాలి.** మనిషి జీవితంలో అత్యంత విలువైనది సమయం. ప్రతి క్షణం, తీరిక సమయం ఎంతో విలువైనది. ఎలాంటి మేలు చెయ్యని ఒక సుదీర్ఘ కాలం కంటే జాలి మనసుతో, ప్రేమామృత హృదయంతో ఇతరులకు సహాయపడిన కొన్ని క్షణాలు ఎంతో విలువైనవి. ఈ క్షణాలు స్నేహాలను, సంబంధాలను కాపాడతాయి.

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది    ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

59 ఆయత్‌లు

# 44. అద్ దుఖాన్

మక్కా అవతరణ

43 – 50 జక్కూమ్[38] చెట్టు పాపాత్ముని భక్షణం; నూనె మడ్డి లాంటిది,[39] కడుపులో పొంగుతుంది, కాగే నీరు పొంగేలా. "పట్టుకోండి ఇతన్ని, ఈడ్చుకుంటూ తీసుకువెళ్ళండి నరకం నట్టనడుమలోకి, బోర్లించండి, ఇతని తలపైన ఉడికే నీటి యాతనను; చవిచూడు దీన్ని, మా గొప్ప గౌరవమున్న వాడివే నీవు. ఇది అదే, దీని రాక విషయంలోనే మీరంతా అనుమానానికి లోనయి ఉండేవారు."

51 – 55 దైవభక్తిపరాయణులయిన వారు, ప్రశాంతస్థలిలో[40] ఉంటారు. తోటల్లో, సెలయేరుల్లో, పల్చని పట్టు పీతాంబర జలతారు[41] వస్త్రాలు ధరించి, ఎదురుబొదురుగా కూర్చుని ఉంటారు. అలా ఉంటుంది వారి వైభవం. మరి మేము పసిడి వన్నెల హరిణాక్షులయిన కన్యలను[42] వీరికిచ్చి పెళ్ళి చేస్తాము. వారక్కడ అన్నివిధాల రుచికరమయిన పదార్థాలు సంతృప్తిగా కోరి తెప్పించుకుంటారు.[43]

38. **"జక్కూమ్"** వివరణ కోసం చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం.7, అస్సాఫ్ఫాత్: పాద సూచి 34.

39. మూలంలో **"ముహ్ల్"** అనే పదప్రయోగం జరిగింది. దానికి పలు అర్థాలు ఉన్నాయి: కరిగిన లోహం, చీము, నెత్తురు, కరిగిన డాంబరు, లావా, నూనె మడ్డి. ఈ విభిన్న అర్థాలు నిఘంటుకారులు, వ్యాఖ్యాతలు తెలిపినవి. కాని 'జక్కూమ్' అంటే మన నాట ఇంద్రాణం అనేదే అయినట్లయితే దాన్ని నమిలినప్పుడు బయల్పడే రసం, బహుశా నూనె మడ్డిని పోలి ఉంటుంది.

40. ప్రశాంత స్థలం అంటే ఉద్దేశం, ఎటువంటి వెరపులేని స్థలం అన్నది. ఎటువంటి విచారం, ఆందోళన, ప్రమాద భయం, సంశయం, కష్టం, బాధ కలగని స్థలం అన్నమాట. హదీసులో దైవ సందేశహరులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) ఇలా పలికినట్లు ఉంది, "స్వర్గవాసులకు చెప్పివేయడం జరుగుతుంది, మీరిక్కడ సదా ఆరోగ్యవంతులయి ఉంటారు ఎప్పటికీ అస్వస్థతకు గురికారు. ఎల్లకాలాలకు బ్రతికే ఉంటారు, చావు అసలే రాదు. ఎల్లప్పుడూ సంపన్నులయి ఉంటారు, దారిద్ర్యం ఎన్నటికీ దరిచేరదు. నిత్యం యవ్వనులయి ఉంటారు, ముసలితనం రానే రాదు." *(ముస్లిమ్ – అబూ హురైరా, అబూ సయీద్ ఖుద్రీ ఉల్లేఖనం).*

41. మూలంలో (సున్దుస్) (ఇస్తబ్రక్) అనే పదాలు ప్రయోగించబడ్డాయి. 'సున్దుస్' అన్నది అరబీలో పలుచని పట్టు వస్త్రాన్ని అంటారు. 'ఇస్తబ్రక్' అన్నది పర్షియన్ పదం 'స్తబర్' కు అరబీకరణ. ఇది మందమయిన పట్టు వస్త్రానికి ప్రయోగిస్తారు.

42. మూలంలోని పదాలు (హూరున్ ఈన్) అన్నవి. 'హూర్' అన్నది 'హౌరా'కు బహువచనం. 'హౌరా' అంటే అరబీలో ఎర్రని స్త్రీని అంటారు. 'ఈన్' అన్నది 'అయినా' కు బహువచనం. ఇది పెద్ద పెద్ద కళ్ళున్న స్త్రీకి ప్రయోగిస్తారు. *(మరింత వివరణకు చూడండి ఖుర్‌ఆన్ అవగాహనం: సం.7, అస్సాఫ్ఫాత్: పాదసూచికలు 26, 29).*

43. 'సంతృప్తిగా' తెప్పించుకోవడమంటే, ఏ పదార్థం ఎంత కావాలనుకుంటే అంత నిశ్చింతగా స్వర్గ సేవకులను పురమాయించి తెప్పించుకుంటారు, అది వెంటనే హాజరుపరచడం జరుగుతుంది. ప్రపంచంలో ఏ వ్యక్తి అయినా, హోటలు అలా ఉంచి తన స్వంత ఇంటిలోనూ తన స్వంత వస్తువుల్ని సయితం స్వర్గంలో కోరుకున్నట్లు తెప్పించుకోలేడు. ఇక్కడ ఏ వస్తువయినా అనంతమయిన రాశులుగా ఎవరివద్దా ఉండదు. మనిషి ఏ వస్తువు ఉపయోగించినా ఎట్టి పరిస్థితిలోనూ దాని మూల్యం అతను తన జేబు నుంచి చెల్లించవలసి ఉంటుంది. స్వర్గంలో సొమ్ము అల్లాహ్‌కు చెందినది, దాసునికి దాన్ని వినియోగించుకునే స్వేచ్ఛ విచ్చలవిడిగా ప్రాప్తమయి ఉంటుంది. ఏ వస్తువూ అంతమయిపోయే ప్రమాదముండదు, తరువాత బిల్లు చెల్లించే ప్రశ్నా ఉండదు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2

(కితాబుల్ మగాజీ)

### అధ్యాయం : 49

## మక్కా విజయం నాడు దైవప్రవక్త(సఅసమ్) జెండాను ఎక్కడ పాతిపెట్టారు?

**153)** హిషామ్ బిన్ ఉర్వా తన తండ్రి గారి నుండి ఇలా ఉటంకించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మక్కా వైపునకు బయలుదేరినప్పుడు ఖురైషులకు ఆ సమాచారం అందింది. అప్పుడు అబూ సుఫ్యాన్ బిన్ హరబ్, హకీమ్ బిన్ హిజామ్, బుదైల్ బిన్ వరఖా–వీరు ముగ్గురూ కలిసి దైవప్రవక్త(స) రాక గురించి నిర్ధారించుకోవడానికి మక్కా నుండి బయల్దేరారు. వారు కాలినడకన వస్తూ, 'మర్రజ్జహ్రాన్'[1]కు చేరుకునేసరికి, అనేకచోట్ల మంటలు కనిపించాయి. అవి అరఫాత్ మైదానంలోని మంటల్లా ఉన్నాయి. 'ఈ మంటలు ఎవరు పెట్టారు? ఇవి అరఫాత్ మైదానంలోని మంటల్లా ఉన్నాయి కదూ!'[2] అని అబూ సుఫ్యాన్ చెప్పగా, 'ఇవి బనీ అమ్ర్(ఖుబా తెగలవారు) వెలిగించిన మంటలు' అని బుదైల్ బిన్ వరఖా అభిప్రాయపడ్డాడు. దానికి అబూ సుఫ్యాన్, 'లేదు. బనూ అమ్ర్ తెగవారు ఇంత మంది ఉండరు' అని అన్నాడు.

ఈ సంభాషణ జరుగుతుండగానే దైవప్రవక్త(స) భద్రతా సిబ్బంది, వాళ్ళను నిర్బంధించి ప్రవక్త సమక్షంలో హాజరుపరిచారు. ఆ తరువాత అబూ సుఫ్యాన్ ఇస్లామ్ స్వీకరించాడు. పిదప దైవప్రవక్త(స) మక్కా నగరంవైపు సాగిపోతూ, "గుర్రాలు సవ్వడి చేస్తూ సాగిపోయే దారి ప్రక్కన అబూ సుఫ్యాన్ (రజి)ను నిలబెట్టండి. ఆయన గారు ముస్లింల సైనిక బలాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలి" అని హజ్రత్ అబ్బాస్(రజి)కు సూచించారు. ఈ సూచనానుసారం అబూ సుఫ్యాన్‌ను నిలబెట్టవలసిన చోటే నిలబెట్టారు అబ్బాస్. వివిధ తెగలవారి సైనిక దళాలు ఒక్కొక్కటిగా అబూ సుఫ్యాన్ ముందు నుంచే కదం తొక్కుతూ సాగిపోతుంటే ఆ దృశ్యాన్ని ఆశ్చర్యచకితులై వీక్షించారు అబూ సుఫ్యాన్.

ఒక సైనిక దళం తన ముందు నుండి సాగిపోతుండగా, 'అబ్బాస్! ఇది ఏ దళం?' అని అబూసుఫ్యాన్ అడగ్గా, 'ఇది గిఫ్ఫార్ తెగ' అని ఆయన చెప్పారు. దానికి అబూ సుఫ్యాన్, 'నాకు గిఫ్ఫార్ తెగవారితో పనేమిటి?' అన్నారు. అంతలోనే జుహైనా తెగవారి దళం సాగిపోయింది. వారిని గురించి కూడా అబూ సుఫ్యాన్ అదే ప్రశ్న వేశారు. బనూ సులైమ్ తెగవారు సాగిపోతున్నప్పుడు కూడా వారి గురించి అదే ప్రశ్న. చివరకు ఓ భారీ సైనిక దళం ముందుకు వచ్చింది. అటువంటి సైనిక దళాన్ని ఆయన అంతకుముందు ఎప్పుడూ చూడలేదు. 'ఎవరు వీరు?' అని అబూ సుఫ్యాన్ ప్రశ్నించగా, 'ఇది అన్సార్ల దళం... సాద్ బిన్ ఉబాదా (రజి) ఈ దళానికి అధిపతి. ఆయన చేతుల్లోనే అన్సార్ల ధ్వజం ఉంది' అని అబ్బాస్ సమాధానమిచ్చారు.

‘అబూ సుఫ్యాన్! ఈ రోజు రక్తం చిందించే రోజు. ఈ రోజు కాబా గృహ ప్రాంగణంలో యుద్ధం చేసేందుకు అనతి లభించింది’ అని సాద్ బిన్ ఉబాదా (రజి) రెచ్చగొట్టే విధంగా మాట్లాడారు.

దానికి అబూ సుఫ్యాన్, ‘ఓహో! అబ్బాస్! ఖురైషులు నాశనమయ్యే దినం వచ్చేసిందన్నమాట!!’[3] అని వ్యాఖ్యానించారు.

అంతలోనే అతి చిన్న సైనిక దళం ఒకటి వచ్చింది. ఆ దళంలో దైవ ప్రవక్త(స)తోపాటు కొంతమంది సహచరమాన్యులు కూడా ఉన్నారు. దైవప్రవక్త(స) ధ్వజాన్ని జుబైర్ బిన్ అవ్వామ్(రజి) పట్టుకుని ఉన్నారు. దైవప్రవక్త(స) అబూ సుఫ్యాన్ ముందు నుండి సాగిపోతుండగా, ‘సాద్ బిన్ ఉబాదా ఏమన్నారో మీకు తెలుసా?’ అనడిగారు. దానికి దైవప్రవక్త(స), “ఏమన్నాడు?” అని దర్యాప్తు చేయగా, ‘ఈ రోజు ఖురైషులందరినీ సంహరించటం జరుగుతుందని సాద్ చెప్పిపోయాడ’ని అబూ సుఫ్యాన్ వివరించారు. దానికి ఆయన(స), “సాద్ చెప్పింది తప్పు. అసలు విషయం ఏమిటంటే ఈ రోజు అల్లాహ్ కాబా గౌరవాన్ని, ఔన్నత్యాన్ని మరింతగా పెంచాడు. ఈ రోజు కాబా గృహానికి గిలాపు తొడిగించబడుతుంది” అని చెప్పారు.

తన ధ్వజాన్ని (జన్నతుల్ మఅలాకు సమీపంలో ఉన్న) ‘హుజూన్’లో పాతిపెట్టమని ఆయన(స) ఆజ్ఞాపించారు.

(వేరొక సనదు ప్రకారం) ఉర్వా ఇలా అన్నారు: తనకు అబ్బాస్ (రజి) చెప్పినట్లుగా నాఫే నాకు ఇలా తెలియపరిచారు: అబ్బాస్ గారు జుబైర్ బిన్ అవ్వామ్ (రజి)తో, ‘ఓ అబూ అబ్దుల్లాహ్! (మక్కా విజయం తర్వాత) జెండాను ఇక్కడే (హుజూన్‌లోనే) పాతిపెట్టమని దైవప్రవక్త(స) మీకు ఆజ్ఞాపించారా?’ అని అడిగారు.

ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు: ఆ రోజు దైవప్రవక్త(స), మక్కా మెరక ప్రాంతమైన ‘కదా’ వైపు నుండి నగరంలో ప్రవేశించమని ఆజ్ఞాపించారు. అయితే దైవప్రవక్త(స) మాత్రం ‘కదా’ పల్లపు ప్రాంతం గుండా నగరంలో ప్రవేశించారు. ఆ రోజు ఖాలిద్ (రజి) దళంలోని ఇద్దరు సహచరులు- హుబైష్ బిన్ అష్అర్, కుర్జ్ బిన్ జాబిర్ ఫిహ్రీ అమరగతి నొందారు.[4]

153-1. ‘మర్రజ్జహ్‌రాన్’ అనేది మక్కా నగరానికి ఒక మంజిల్ దూరాన ఉంది. దానిని ఇప్పుడు ‘వాదియె ఫాతిమా’గా వ్యవహరిస్తున్నారు.

153-2. ఇస్లామ్‌కు పూర్వం అరబ్బు తెగలవారు హజ్జ్ సందర్భంగా అరఫాత్ మైదానంలో రాత్రిపూట తమ తమ తెగల ఉనికిని చాటుకోవటానికి వేర్వేరుగా మంటలు పెట్టుకునేవారు.

153-3. దైవప్రవక్త(స) అబూ సుఫ్యాన్ ముందు నుండి సాగిపోతున్నప్పుడు, ‘దైవప్రవక్తా! మీరు మీ జాతి వారిని సంహరించమని ఆజ్ఞాపించారా?’ అని దేవునిపై ఒట్టేసి మరీ అడిగాడు. దానికి దైవప్రవక్త(స), “లేదు” అని అన్నారు. అప్పుడు అబూ సుఫ్యాన్, సాద్ బిన్ ఉబాదా (రజి) చెప్పిన మాటను ప్రస్తావించగా ఆయన(స) ఇలా అన్నారు: “ఈ రోజు కనికరించే రోజు. ఈ రోజు అల్లాహ్ ఖురైషులకు గౌరవం ప్రసాదిస్తాడు”-తర్వాత ఆయన(స) సాద్ చేతిలో ఉన్న జెండాను తీసుకుని, దానిని ఖైస్‌కు అందించారు.

153-4. ఖాలిద్ బిన్ వలీద్(రజి) తన సైనిక దళాన్ని తీసుకుని మక్కాలో ప్రవేశించినప్పుడు సఫ్వాన్ బిన్ ఉమయ్యా, సుహైల్ బిన్ అమ్ర్ కొంతమంది మనుషులతో వచ్చి స్వల్పంగా ప్రతిఘటించారు. ఈ ప్రతిఘటనలో 13 మంది అవిశ్వాసులు చనిపోగా, ఇద్దరు ముస్లింలు అమరగతి నొందారు.

★★★

‘చరితార్థులు’-2



# మౌలానా అబ్దుల్ హమీద్ బాఖ్వీ

## (1876 -1955)

70




మాతృభూమి విముక్తి పోరాటంలో పూర్తిగా నిమగ్నం కావడం మాత్రమే కాకుండా ఖురాన్ గ్రంథాన్ని సమగ్రంగా తమిళంలో తర్జుమా చేయడం లక్ష్యంగా పెట్టుకుని అవిరామంగా కృషి సల్పిన మౌలానా అబ్దుల్ హమీద్ బాఖ్వీ తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా ఆతూర్ గ్రామంలో 1876 నవంబర్ 26న జన్మించారు. ఆయన తండ్రి ఖాదర్ మొహియుద్దీన్ రౌతార్. ఆయన వెల్లూరులోని బాఖియాత్–ఎ–సాలిహత్ అరబిక్ కళాశాలలో అరబిక్ భాష మరియు ఆలిమ్ డిగ్రీలను పూర్తి చేశారు. చిన్ననాటి నుండి ప్రగతిశీల భావజాలం కలిగి విద్యాభ్యాసం మీద ప్రత్యేక దృష్టి పెట్టిన ఆయన తమిళం, ఉర్దూ, పర్షియన్, ఫ్రెంచ్, అరబిక్ భాషలలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. జాతీయోద్యమంలో మహాత్ముని అడుగుజాడల్లో నడిచిన ఆయన ఖద్దరు ధారణ చేయడం మాత్రమే కాకుండా ఖద్దరు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. వివాహాల సందర్భంగా వధూవరులు ఖద్దరు వస్త్రధారణ తప్పనిసరిగా చేయాలని, ఆ సూచనను పాటించని వారి పెళ్లిళ్ళను నిర్వహించరాదని పెళ్ళిళ్ళ నిర్వహించు ఖాజీలకు సూచించారు. మంచి వక్త అయినటువంటి ఆయన మద్యపానం మానమని ప్రజలను కోరుతూ ఉత్తేజకరంగా ఉపన్యాసాలిస్తూ మద్యపాన వ్యతిరేక కార్యక్రమాలలో ముమ్మరంగా పాల్గొన్నారు. జాతీయోద్యమ నాయకులు అబుల్ కలాం ఆజాద్ తమిళనాడు పర్యటించినప్పుడల్లా ఆయన ఉర్దూ ప్రసంగాలను మౌలానా బాఖ్వీ తమిళంలో అద్భుతంగా అనువదిస్తూ ఆయన వెంట సాగారు. చక్రవర్తి రాజగోపాలాచారి, పెరియార్ ఇ.వి.ఆర్ రామస్వామి, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌తో ఆయన సన్నిహిత సంబంధాలు సాగించారు. జాతీయోద్యమ కార్యక్రమాలలో ఒక వైపున చురుగ్గా పాల్గొంటూ, మరో వైపున ఖురాన్ గ్రంథాన్ని తమిళంలో తర్జుమాను ఆరంభించారు. మౌలానా అబ్దుల్ హమీద్ బాఖ్వీ పద్నాలుగు సంవత్సరాల పాటు కృషిచేసి తమిళంలో తొట్టతొలి ఖురాన్ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ గ్రంథం ఔన్నత్యాన్ని తెలుసుకున్న నిజాం నవాబు ఆ గ్రంథ ప్రచురణకు చేయూత ఇచ్చారు. ఇస్లాం మత మౌలికతత్వాన్ని ప్రజలకు సుబోధకమయ్యేలా పలు గ్రంథాలను ఆయన రచించారు. మౌలానా బాఖ్వీ రచించిన ‘సహజ మతం’ (EYARKAI MADHAM) అను బృహత్తర గ్రంథానికి సాంఘికోద్యమకారుడు పెరియార్ ఇ.వి.ఆర్ రామస్వామి ముందుమాట రాశారు. చివరి క్షణం వరకు రచనా వ్యాసాంగాన్ని కొనసాగించిన మౌలానా అబ్దుల్ హమీద్ బాఖ్వీ 1955 జూన్ 23న పాండిచ్చేరిలోని కరాయ్‌కల్ గ్రామంలో చివరి శ్వాస విడిచారు. ❑



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **‘చరితార్థులు’ - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



- ముహమ్మద్ ముజాహిద్

# పుస్తకమే బెస్ట్ ఫ్రెండ్!

◆ జీవితానికి మార్గదర్శి పుస్తక పఠనమే! ◆ ప్రపంచ విజేతలంతా పుస్తక ప్రియులే!
◆ 2025లో పుస్తకాలతో స్నేహం చేద్దాం

**'చిరిగిన చొక్కా అయినా వేసుకో.. మంచి పుస్తకం కొనుక్కో'** అన్నారు ప్రముఖ తెలుగు రచయిత, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు. కానీ 'చిరిగిన చొక్కా అయినా వేసుకొని ఖరీదైన ఫోను కొనుక్కొంటా' అన్నట్టు ప్రవర్తిస్తున్నారు చాలా మంది యువత. స్మార్ట్‌ఫోన్ మాయలో పడిన వారు పుస్తక పఠనాన్ని అటకెక్కిస్తున్నారు. యువతీ, యువకులు గంటల కొద్దీ సమయాన్ని ఫేస్‌బుక్, వాట్సాప్ చాటింగ్‌లలో, యూట్యూబ్ వీక్షణలో గడిపేస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది! సోషల్ మీడియా ఎన్ని విప్లవాత్మక మార్పులు తెచ్చినా, కొత్త అభిరుచులు (హాబీలు) సృష్టించినా పుస్తక పఠనానికి మించిన మంచి హాబీ మరొకటి లేదన్నది నా అభిప్రాయం. ఎందుకంటే మనం చదివే మంచి పుస్తకాలు మన ఆలోచనా పరిధిని పెంచుతాయి. మంచి ఆలోచనలు సమాజంపై మంచి ప్రభావాన్ని చూపుతాయి. కనీసం రోజుకో పేజీ అయినా చదివే అలవాటు నేటి నుంచే అలవర్చు కోండి. కనీసం ఒక్క పేజీ చదవందే మనకు ఆ రోజు రాత్రి నిద్ర పట్టకూడదు. ప్రపంచాన్ని శాసిస్తున్న అభివృద్ధి చెందిన దేశాల్లో పుస్తక పఠనం చేసేవారి సంఖ్య ఎక్కువ. ఆ దేశాల్లో ఏడాదికి సగటున ఒక్కొక్కరు కనీసం 11 పుస్తకాలు చదువుతారని సర్వేలు చెప్తున్నాయి. పుస్తకాలు కొనుక్కుని మరీ చదివే అలవాటు ఆ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్న విషయం మనకెంత మందికి తెలుసు? మనలో చాలామంది బర్గర్, పిజ్జా, సాండ్ విచ్ కొనుగోళ్లకు తమ డబ్బును వెచ్చిస్తున్నారు.

మంచి పుస్తకాలు, మంచి వ్యాసాలు చదవడం వల్ల మన జ్ఞానం పెరిగి మేధస్సు చురుకవుతుంది. హృదయం వికసిస్తుంది. ధనం కన్నా జ్ఞానం మిన్న. పుస్తక పఠనం ఆరోగ్యానికి మంచిదని వైద్య నిపుణులు చెప్తున్నాయి. ఈ అలవాటు మన ఆయుష్షునూ పెంచుతుంది. పుస్తకాలు చదివే అలవాటు వల్ల ఒత్తిడి దరి చేరదని ఓ బ్రిటన్ యూనివర్సిటీ పరిశోధనలో తేలిదంటే ఈ అలవాటుకు ఉన్న ప్రాధాన్యం ఏమిటో తెలుసుకోవచ్చు. పుస్తక ప్రదర్శనలకు, గ్రంథాలయాలకు వెళ్లడం వల్ల కొత్త పరిచయాలు ఏర్పడతాయి. మేధావుల, రచయితల, ప్రచురణకర్తల సహవాసం లభించవచ్చు. వారితో పరిచయం కూడా మనకు పుస్తక పఠనం ద్వారా లభించినంత జ్ఞానాన్ని అందిస్తుంది.

### జ్ఞాపక శక్తికి మంత్రం

పుస్తక పఠనంవల్ల పద సంపద, జ్ఞాపక శక్తి పెరుగుతుంది. అందుకే చిన్నప్పటి నుంచే పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయాలి. ప్రపంచంలో అద్భుతాలు చేసినవారంతా పుస్తకాల ప్రేమికులే.

చరిత్రలో విజయాలు సాధించిన వారంతా పుస్తకాల పురుగులే. అందుకే పుస్తకాలను మీ బెస్ట్ ఫ్రెండ్స్‌గా చేసుకోండి. అందుకే జ్ఞానాన్ని అర్జించడం ప్రతి ముస్లిమ్(స్త్రీ, పురుషులిద్దరికీ) విధిగా చేశారు మహమ్మద్ ప్రవక్త మహనీయులు.

### నిద్రలేమికి చక్కని పరిష్కారం

ఇటీవల కాలంలో స్మార్ ఫోన్ మన నిద్రను, కండ్ల ఆరోగ్యాన్ని హరిస్తున్నది. నిద్ర లేమి అనేక శారీరక రుగ్మతలకు కారణమవు తుంది. అదే రాత్రి వేళ భోజనం చేశాక కాసేపు మంచి పుస్తకం పట్టుకొని చదవండి.. మీకు ఎంత చక్కగా నిద్ర పడుతుందో మీరే గమనించండి.

### బంధాలను బలపరుస్తుంది

పుస్తకాలు చదివే అలవాటున్న వాళ్లలో సామాజిక స్పృహ మెండుగా ఉంటుంది. ఇతరులతో మంచి సంబంధాలు నెరపగలుగుతారు. నవలలు, కథలు, చరిత్ర చదివేవారు ఎదుటివారి మనసెరిగి మాట్లాడగలుగుతారు. ఎదుటివారి భావాలు, ఇష్టాఇష్టాలు తెలుసుకుని మాట్లాడితే ఆ బంధం బలపడుతుంది. సమాజంలో మంచి గుర్తింపు వస్తుంది. మన ఎదుగుదలకు పనికివచ్చే అవకాశాలు తలుపు తడతాయి. పుస్తక పఠనం ఇందుకు దోహదం చేస్తున్నది.

### ఎలాంటి పుస్తకాలు చదవాలి?

మన మనస్సుకు ఆహ్లాదాన్ని, మన మెదడుకు విజ్ఞానాన్ని ఇచ్చే మంచి పుస్తకాలనే చదవాలి. మనలో మంచి భావాలను పెంపొందించే వాటికి ప్రాధాన్యమివ్వాలి. చరిత్ర, శాస్త్ర సాంకేతిక అంశాలు, జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదవాలి. పద సంపద, వ్యాకరణ పరిజ్ఞానం, భాషా పరిజ్ఞానం, సృజనాత్మకశైలి పెంచుకోవడానికి సాహిత్య ప్రధాన పుస్తకాలు చదవాలి. విద్యార్థులైతే పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా సామాజిక, ఆర్థిక, నైతిక, విజ్ఞాన, చరిత్ర, సృజనాత్మకత, సాహిత్య అంశాలకు సంబంధించిన వివిధ భాషల పుస్తకాలు తరచూ చదువుతుండాలి. కాలేజీ, విశ్వవిద్యాలయ స్థాయి విద్యార్థులు ధార్మిక, ఆధ్యాత్మిక, తత్వ శాస్త్ర పుస్తకాలను కూడా చదవాలి. ఓ విద్యార్థి లేదా వ్యక్తి వృత్తిగత, వ్యక్తిగత జీవితంలో రాణించాలంటే, బాధ్యతాయుత పౌరుడిగా ఉండాలంటే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి. ఓ కుటుంబంలో ఒక తండ్రిగా, కొడుకుగా, కోడలిగా, అత్తగా, తమ్ముడిగా, అక్కగా, భర్తగా, భార్యగా ఇలా మన బాధ్యతలను సమర్థంగా నెరవేర్చడానికీ పుస్తక పఠనం పనికొస్తుంది. విద్యా సంస్థలు కూడా తమ విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి బుక్ కమిటీలు వేయాలి. ఇదే సమయంలో మనలో క్షణికావేశాలు, ఉద్రికత్తలు, మతోన్మాదం, కులోన్మాదాన్ని పెంచే వివాదాస్పద పుస్తకాలకు దూరంగా ఉండాలి.

స్కూళ్లు, కాలేజీల్లో నేర్చుకోని, నేర్చుకోలేని విషయాలను పుస్తకాలు చదివి తెలుసుకోవచ్చు. జీవితంలో విజయాలు సాధించేందుకు ప్రపంచ విజేతల జీవిత గాథలు చదవాలంటారు ప్రముఖ అమెరికన్ రచయిత జిమ్ రోమ్. పుస్తకాలు చదవడం వల్ల మన వ్యక్తిగత సామర్థ్యాలు పెరిగి అవగాహన శక్తి ఇనుమడిస్తుంది. ఇవన్నీ జరగాలంటే పుస్తక పఠనం ద్వారా ఆర్జించిన జ్ఞానాన్ని ఆచరణలో పెట్టాలి.

అంతిమంగా చెప్పాలంటే పుస్తకానికి మించిన గురువు మరొకరు ఉండరు. జీవితంలో ఎన్ని క్లిష్ట పరిస్థితులొచ్చినా పుస్తకమనే నేస్తం మన వెంట ఉంటే కష్టాల నుంచి గట్టెక్కినట్టే! పుస్తక పఠనం మనలో ఆలోచన పరిధిని పెంచి ఆత్మ విశ్వాసాన్ని కలిగిస్తుంది. ప్రశాంతతను, ఏకాగ్రతను పెంచుతుంది. పుస్తక పఠనం వృద్ధుల్లో అల్జీమర్స్ వ్యాధిని నిరోధిస్తుంది. ఆధునిక సాంకేతికత కారణంగా ఇప్పుడు పుస్తకాలు ఆన్‌లైన్‌లోనూ లభ్యమవుతున్నాయి. ఈ-బుక్‌లను మన చేతిలోని స్మార్ట్ ఫోన్‌లోనో, ల్యాప్‌ట్యాప్‌లోనో చదివేయవచ్చు. అయితే అచ్చు పుస్తకాన్ని చదవడానికి ప్రాధాన్యమిస్తేనే మంచిది. ఆ ఆనందం, అనుభూమి అత్యున్నతంగా ఉంటుంది!

కొత్త ఆంగ్ల సంవత్సరం (2025) మీరంతా, ముఖ్యంగా విద్యార్థులు పుస్తక పఠనాన్ని క్రమం తప్పని హాబీగా మార్చుకుంటారని ఆశిస్తున్నాను. ప్రపంచంలో ఉండే ఏకైక మంచి వ్యాపకం పుస్తక పఠనం మాత్రమే అంటే అతిశయోక్తి కాదేమో!

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

౨

# ఇస్లామీయ ఉద్యమం- దాని క్రమవికాసం

- ఎస్.ఎమ్. మలిక్

## ఆచరణా విధానం

ఏ ఉద్యమమయినా, అది సైద్ధాంతికమయినదయినా లేదా తాత్కాలిక అవసరార్థం చేపట్టినదయినా, దాని ఆచరణా విధానం గురించి ఒకటి గుర్తుంచుకోవలసి ఉంటుంది. అది సదా పరిస్థితులకు, సాధనా మార్గాలకు లోబడే ఉంటుంది. కాని ఇస్లామీయ ఉద్యమ ఆచరణా విధానం దాని మూల్యాలకు, ప్రాథమిక ఆధారాలకు కట్టుబడి ఉంటుంది. ఇంతకూ ఇస్లామీయ ఉద్యమ ఆచరణా విధానంలో పరిస్థితులకు సాధనా సంపత్తికి కూడా స్థానముంది కాని దాని ప్రాతిపదిక సూత్రాలకు లోబడి మాత్రమే. జమాఅత్ నిబంధనావళిలో ఆచరణా విధానంలో ప్రకటించిన అంశాలలో ప్రాతిపదిక విషయాలతోపాటు స్థలకాలపు ఆవశ్యకతలను సయితం సమగ్రంగా పేర్కొనడం జరిగింది. అంతేకాక అటువంటి స్థలకాల రాయితీలు ఏఏ పరిధుల్లో సాధ్యమో కూడా తెలుపడం జరిగింది. ఇక ఈ అవకాశాన్ని ఇంకా పెంచే అవసరం ఇప్పుడూ లేదు ఇంకా వచ్చే పాతికేళ్ల వరకు కూడా ఆ అవసరం కలగదు. అయితే, దైవం మన్నించుగాక, ఉద్యమంలోనే అటువంటి మార్పు చేయవలసిన విపత్తు వస్తే లేదా పరిస్థితులే మారిపోయే అవస్థ దాపురిస్తే తప్ప.

**ఉద్యమంలో చేరుతున్న నవతరానికి ప్రత్యేకం**

## ధ్యేయం

జమాఅత్ నిబంధనావళిలో ధ్యేయం ఏ క్రమంలో పేర్కొనబడిందో దాన్ని కాదని చివరన దీన్ని ప్రస్తావించడానికి కారణం ఏమిటంటే, ఈ ధ్యేయం ఆధారంగానే కొన్ని విషయాలు విన్నవించుకోదలిచాను ప్రస్తుతం.

జమాఅత్ ఏర్పరచుకున్న ధ్యేయం, కుర్ఆన్, సున్నతుల ఆధారంగానే ఏర్పరచడం జరిగింది. ఇంకా ఇది ఇస్లామీయ సముదాయం కొరకు దైవికంగా విధితమయినది అన్న విషయంలో ఇప్పుడు కేవలం జమాఅత్ అనుయాయులనే కాక ముస్లిమ్ సముదాయానికి సర్వ సాధారణంగా అంగీకార భావన ఏర్పడింది. ఈ విషయంలో ఎటువంటి చర్చకూ ఇక తావులేదు. అవసరమూ లేదు. అయితే దాని వివరణలో పేర్కొనబడిన అంశాలు, వాటి వివరాలను గురించి చర్చించడానికి అవకాశం ఉంది, అలా చర్చించడం అవసరం కూడా. నేటి విన్నపాలు ఆ చర్చకు మూలాంకురం.

'ధ్యేయం' విశదీకరణలో ప్రముఖంగా మూడు అంశాలు లేదా కృషి చేసే దిశలు లేదా దారులు పేర్కొనబడ్డాయి. 1) వ్యక్తి ప్రగతి 2) సమాజ నిర్మాణం 3) రాజ్య రూపకల్పన. ప్రారంభంలోనే ఒక విషయం వ్యక్తం చెయ్యడం సమంజసంగా ఉంటుందని భావిస్తున్నాను. ఇస్లామీయ ఉద్యమానికి ప్రప్రథమ రథసారధి, మౌలానా అబుల్ లైస్ ఇస్లాహి(రహ్మ) సదా మూడవ దిశను "రాజ్య రూపకల్పన"కు బదులుగా "రాజకీయాల రూపకల్పన" అని పేర్కొనేవారు. దాన్ని ఆయన

మాత్రమేకాక, ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలు సయితం ఆ పదం మారడం వల్ల ఏర్పడే వ్యత్యాసమేమిటో క్షుణ్ణంగా అర్థం చేసుకోగలిగేవారు. ఇస్లామీయ రాజ్య రూపకల్పనకు ముందు ఇస్లామీయ రాజకీయాలను మన దేశంలో పరిచయం చేయడం ఎంత అవసరమో అందరికీ విదితమే. ఆ 'దశ'ను దాటకుండా రాజ్య రూపకల్పనకు సంకల్పించడం ఎంత కఠినమో, ఎన్ని కుశంకలకు దారి తీస్తుందో చెప్పనవసరం లేదు.

నేను మొదటనే విన్నవించుకున్నట్లు, ధ్యేయంలో విశదీకరించిన ఈ మూడు అంశాలను గురించి సవివరమయిన చర్చ జరపడమే ఈ వ్యాసానికి అసలు లక్ష్యం. ఒక విషయం మనందరికీ స్పష్టమవడం అవసరం. ధ్యేయంలోని ఈ మూడు అంశాలు వాస్తవానికి ధ్యేయానికి మూడు కార్యాచరణ అంశాలు, కృషి జరిపే 'దిశ'లే కాని 'దశ'లు కావు.

## ఉద్యమ కృషి

ఈ మూడు దిశలలో కృషి జరపడమే సాధారణంగా 'ఉద్యమ కృషి'గా పేర్కొనడం జరుగుతుంది. అయితే ఈ మూడు దిశలు లేదా కార్యరంగాలలో అనేక నిమ్న కార్యరంగాలుండటం సాధ్యమే. ప్రతి నిమ్న రంగంలో కృషి జరపకుండా ఆ బృహత్కార్య రంగాన్ని సంపూర్ణంగా నిర్వహించలేము. అయితే ఏ నిమ్న కార్య రంగానికి ఎప్పుడు ఎంత ప్రాముఖ్యత ఇవ్వవలసి ఉందో అది ఆయా పరిస్థితులు, సాధనా సంపత్తిపైన ఆధారపడి ఉంటుంది. ఉద్యమ కృషిని తొలినాటి నుంచే ప్రణాళికాబద్ధంగా ప్రారంభించడం జరిగింది. జమాఅత్ ద్వారా కాలానుగుణంగా ప్రచురించబడిన నివేదికలే (Reports) దానికి ప్రత్యేక సాక్ష్యం. వాటి ద్వారా తెలిసేదేమిటంటే ఈ మూడు కార్యరంగాలలోనూ సదా కృషి జరుగుతూ వచ్చింది. మనం స్థూలంగా పరిశీలించినా, రిపోర్టుల ద్వారా తెలిసేదాన్ని బట్టి ఈ మూడు రంగాలలోనూ ఓ క్రమానుగతి, అంచెలంచెల ప్రగతీ కానవస్తాయి.

ప్రారంభంలో ముస్లిమ్ సముదాయానికి అది మరచిపోయిన పాఠం గుర్తు చేయడమే ప్రధాన కార్యమయి ఉండేది. ఉద్యమ ఆలోచనలు, సిద్ధాంతాలు అప్పుడు సముదాయానికి అపరిచితంగా అగుపించేవి. అందువల్ల అటువంటి వాతావరణంలో ఆలోచనల్ని, సిద్ధాంతాలను ప్రాచుర్యంలో పెట్టడమే ప్రాముఖ్యత సంతరించుకున్న విషయం. ఆ పైన ఆ ఆలోచనల్ని, సిద్ధాంతాన్ని అంగీకరించి స్వీకరించినవారిని సంఘటితపరచి కార్యోన్ముఖులుగా చేయడమే రెండవ ముఖ్యమయిన కృషి. ఆ కాలంలో ఆలోచనల అవగాహనకు అందరూ కలిసి కూచోవడం, సమావేశాలు (ఇజ్తెమాలు) జరపడం, పుస్తకాలు, చిరు పుస్తకాలు సర్వసామాన్యం చెయ్యడమే ఎంతో అవసరమయి ఉండేది. ఆ సమావేశాలు, కాల నిర్ణయం ప్రకారం పకడ్బందీగా నిర్వహించడమే గొప్ప కార్యంగా ఉండేది. ఎక్కడయినా వారం వారం నిర్వహించే సమావేశాలు (ఇజ్తెమాలు) సరిగ్గా సాగుతున్నాయంటే అక్కడ ఉద్యమ కార్యం మొదలయిందనీ అది జరక్కపోతే ఆగిపోయిందనీ అనుకునేవారు. ఆ సమావేశాలు, సంఘటితంగా సరిగా నడపడంతోపాటు వాటిలో, సందేశాత్మకమయినవి (దావతీ) అనీ, శిక్షణాత్మకమయినవి (తర్బియతీ) అనీ, సంస్థాగత పటిష్టతకు (తన్జీమీ) అని నిర్వహించడమే ఉద్యమ కార్యక్రమం. వాటి ద్వారానే ఉద్యమం విస్తృతమవుతూ వచ్చింది. మరీ ముఖ్యంగా సందేశ ప్రధానమయిన సామాన్య సమావేశాలు క్రమేణ పెద్దఎత్తున నిర్వహించడం కూడా జరిగేది. అటువంటి సమావేశాల ఫలితం, ఉద్యమ సందేశ వ్యాప్తికి మాత్రమే కాక దాని స్వీకృతికి కూడా ఎంతో ఉపయుక్తంగా పరిణమించేది.

## సామూహిక కార్యకలాపాలు

ఈ సమావేశాల ఫలితంగా ప్రాప్తమయిన మానవ వనరుల ద్వారా అనేక సామూహిక కార్యకలాపాలకు తావు ఏర్పడింది. మొదటి దశలో లైబ్రరీల స్థాపన, పత్రికల విడుదల, స్కూళ్ళ ప్రారంభం ఇత్యాదివి. ఇవన్నీ ఆలోచనల, సిద్ధాంతాల వ్యాప్తికి ఉపకరించి వీటి ద్వారా 'వ్యక్తి ప్రగతి' కార్యరంగం విస్తృతమవగా క్రమేణ సమాజ నిర్మాణం దిశగా ముందడుగు వేసే అవకాశాలు మెండుగా దొరకసాగాయి. ఇంకా సమావేశాలు (ఇజ్తిమాలు) కేవలం కాలనియతితో కూడినవే కాక, నగర స్థాయిలో, జిల్లా స్థాయిలో, ప్రాంతం, రాష్ట్రస్థాయిలో కూడా నిర్వహించడం సాధ్యమయింది.

అదే విధంగా ప్రారంభంలోనే దేశ విభజన జరగడం, ముస్లిమ్ సముదాయం ఆ సందర్భంలో ఎదుర్కొన్న పరిస్థితులు వారి ధన, మాన, ప్రాణాల రక్షణ కొరకు రంగంలోకి దిగి, ఉన్న సాధనా సంపత్తి, మానవ వనరుల ద్వారానే సేవలు ఒనర్చే బాధ్యత నిర్వహించవలసి వచ్చింది. ఆ విధంగా అనేక సామూహిక సేవా కార్యకలాపాలలో అడుగిడవలసి వచ్చింది. ఆ విధంగా దేశంలో పలుచోట్ల తాత్కాలికంగానూ, కొన్నిచోట్ల స్థాయి రూపంలోనూ సంఘ సేవా కార్యకలాపాలు, మదరసాలు (పాఠశాలలు), ఆరోగ్య కేంద్రాల ద్వారా సామాన్య సేవా సంస్థలు నెలకొల్పడం జరిగింది. భావనాత్మక రక్షణ కల్పిస్తూనే ఆ విధంగా ముస్లిమ్ సముదాయానికి ఓ ప్రక్కన సైద్ధాంతిక, మరో ప్రక్కన వారి భౌతిక అస్తిత్వాన్నీ (Physical Existance)ని రక్షించవలసిన అవసరం కూడా ఇస్లామీయ ఉద్యమ భుజస్కంధాలపైన పడింది, దాన్ని కూడా ఉద్యమం ఎంతో ఓరిమితో సజావుగా నిర్వహించగలిగింది.




**కవి కరీముల్లా**

**మన భారతదేశాన్ని** ఎంతోమంది ముస్లిం రాజులు పరిపాలించారు. అందరూ ఈ సంస్కృతిలో మమేకమై ఈ మట్టిని ప్రేమించి ఈ మట్టిలోనే కల్సిపోయారు. అయితే వీరంతా ఇస్లాం మత విస్తరణ కాంక్షతో వచ్చారని ఇక్కడి ప్రజలను బలవంతంగా మతం మార్చారు కనుకే ముస్లింల జన సంఖ్య పెరిగిందని కొంత మంది చరిత్రకారులు చర్విత చరణంలా అసంబద్ధ, అసత్య ప్రచారాలు చేశారు. ఏ మతానికి చెందిన రాజులు పరిపాలిస్తే ఆ మతానికి ప్రోత్సాహం లభించిన మాట వాస్తవమే అయినా మొత్తం మత విస్తరణకు అది కారణం కాదు. ఆనాడు సమాజంలో నెలకొని వున్న సామాజిక, ఆర్థిక రాజకీయ, మత పరిస్థితులు ఇస్లాం వ్యాప్తికి దోహద పడ్డాయి. నాడు నెలకొని వున్న చాతుర్వర్ణ వ్యవస్థ, అమానవీయ అంటరానితనం మొత్తం సమాజాన్ని అనేక పాయలుగా చీల్చింది. దిగువ వర్ణాలన్నీ వివక్షత అనే చట్రంలో నలిగిపోయాయి. ఈ పరిస్థితులలో చింపిరిగుడ్డలతో, జోలె సంచులతో వచ్చిన సూఫీ సన్యాసులు ఇస్లామ్‌ను ప్రేమ, సమానత్వం ప్రాతిపదికగా అందించారు. వారి ప్రభావానికి గురైన వేలాది మంది నాటి మూలవాసులు ఇస్లామ్ స్వీకరించి ఆత్మ గౌరవాన్ని పొందారు. అజ్మీర్‌కు చెందిన ఖాజా గరీబ్ నవాజ్ అనే సూఫీ గురువు చేతుల మీదుగా వేలాది మంది ప్రజలు ఇస్లామ్‌లో ప్రవేశించారంటే వారి ప్రభావం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ విధంగా చారిత్రకంగా నాటి తొలితరం మూలవాసులే నేటి ముస్లింలని చెప్పవచ్చు.నేటి వర్తమాన స్థితిగతుల్ని బట్టి చూస్తే ముస్లింలు దళితులకన్నా బాగా వెనుకబడివున్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి అభద్రతా భావంలో కొట్టుమిట్టాడుతున్నారు. దేశ జనాభాలో సుమారు 20 శాతం వుండి కూడా విద్య, ఉద్యోగ విషయాలలో, చట్ట సభల్లో నేటికీ తమ వాటా పొందలేక పోయారు. 1991 జనాభా లెక్కల ప్రకారం ముస్లింలలో దాదాపు సగానికి పైగా దారిద్ర్య రేఖకు దిగువగా వున్నారంటే ఎంత దయనీయమైన స్థితిలో వున్నారో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ముస్లింలలో నేటికీ 2 ఎకరాల పొలంకంటే తక్కువగా వున్నవారు దాదాపు 90% పై చిలుకు వున్నారని గణాంక వివరాలు తెలియపరుస్తున్నాయి. ఇక ఐ.ఏ.యస్., ఐ.పి.యస్, వంటి క్యాడర్లలో కనీసం 1% కూడా మించలేదు. ప్రభుత్వ ఉద్యోగాలలో సైతం చెప్పుకోదగ్గ పరిస్థితి లేదు. ఒక రకంగా చెప్పాలంటే కార్యనిర్వాహక వర్గంలో వీరికి ఏ పాత్ర లేదు. పల్లెలలో నివసించే ముస్లింలు కూలీలుగా జీవనం సాగిస్తూ.

అక్కడి పెత్తందార్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బ్రతుకున్నారు. అయితే మెజారిటీ ముస్లింలు పట్టణాలలోనే స్థిర పడ్డారు. వీరంతా మెకానిక్‌లుగానో, టైలర్లుగానో, డ్రైవర్లుగానో కొనసాగుతున్నారు. ఇంకా రోడ్డు ప్రక్కన చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూనో, చేతివృత్తులు చేసుకుంటూనో పొట్ట పోసుకుంటున్నారు. ఎంతకీ ఎదుగు బొదుగులేని జీవితాలతో, చాలీచాలని ఆదాయంతో దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. ఉత్పత్తి రంగంలో స్త్రీలు పాలు పంచుకోవడంపై ఇస్లామ్ ఎటువంటి నిషేధం విధించక పోయినా పురుషాహంకారం వల్ల స్త్రీలు కుటుంబ ఆర్థికాభివృద్ధిలో పాలు పంచుకోలేక పోతున్నారు. తత్ఫలితంగా వీరి జీవన ప్రమాణస్థాయి దారుణంగా పడిపోయింది.

నేటి ముస్లిం సమాజం ఇంతగా వెనుకబడి వుండటానికి ప్రధాన కారణం నిరక్షరాస్యత, అవిద్య ముస్లింలకు తీరని హాని కల్గించింది. దశాబ్దాల చీకటి గోతుల్ని తవ్వింది. చదివించే స్థోమత లేక పిల్లల్ని పనుల్లోకి పంపటం సహజమై పోయింది. విద్యా ఉద్యోగాలలో సరియైన రిజర్వేషన్ సౌకర్యం లేక పోవటం వలన నిరాశా నిస్పృహలతో ముస్లింలు విద్యకు దూరంగా జరిగి పోయారు. ముస్లింలు మొదటగా ఉద్యమించాల్సింది విద్య, ఉద్యోగాలలో ప్రాతినిధ్యం కోసం మాత్రమే. ఇస్లామ్‌లో విద్యకు, జ్ఞానానికి పెద్ద పీట వెయ్యడం జరిగింది. పవిత్ర ఖుర్‌ఆన్‌లో మొదటి వాక్యం చదువుతోనే ప్రారంభమౌతుంది. స్వయాన దైవ ప్రవక్త ముహమ్మద్ (స) విద్యార్జన కోసం భూమి చివరి అంచుల వరకైనా వెళ్ళండి అని ఉపదేశించారు. అయినా ముస్లిం సమాజం విద్యను గురించి తీవ్రంగా ఆలోచిస్తున్న దాఖలాలు లేవు. ఇటీవలి విద్యా సర్వే ప్రకారం ముస్లిం విద్యార్థుల డ్రాపవుట్స్ శాతం పెరిగింది. ఈ డ్రాపవుట్స్ శాతాన్ని తగ్గించేందుకై ప్రభుత్వం, ముస్లిం సమాజం కలిసి కృషి చేయాల్సిన అవసరం ఎంతో వుంది.

ముస్లిం సమాజంలో మదరసాలకు ఎనలేని ప్రాధాన్యత వుంది. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మదరసాలు కీలకమైన పాత్ర పోషించాయి. అటువంటి మదరసాలు నేడు ఆధునిక విద్యకు దూరమై కేవలం ధార్మిక విద్యకు మాత్రమే పరిమితమయ్యాయి. ఇహలోక సంబంధమైన విషయాలకు, పరలోక సంబంధమైన విషయాలకు ఇస్లామ్ సమాన ప్రాతినిధ్యం ఇచ్చినా ముస్లిం పండితులు మదరసాలలో కేవలం ధార్మిక విద్యను మాత్రమే బోధించటం వల్ల సామాజిక శాస్త్రాల్ని, గణితం, ఇంగ్లీషు, తెలుగు తదితర బోధనాంశాలను ప్రక్కన పెట్టడం ద్వారా నేటి వర్తమాన ప్రపంచంలో ముస్లింల విద్యాస్థాయి దారుణంగా దెబ్బ తింది. ఇప్పుడిప్పుడే ఆధునిక విద్య మదరసాలలో చోటుచేసుకోవటం, ఈ కోణంలో ఉలేమాలు ఆలోచించటం హర్షణీయం. కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నట్లుగా మదరసాలు తీవ్రవాద నిలయాలు కావు. ఇవి విద్యార్థులలో నైతిక వర్తన పెంచుతూ ధార్మిక నియమాలు పాటించే వారిగా తయారు చేస్తాయి.

మతపరమైన విషయాలలోనూ ముస్లింలు ఇస్లామ్ వాస్తవిక రూపాన్ని దర్శించలేక పోతున్నారు. ఇస్లామ్ అత్యంత ప్రగతి శీలమైన ధర్మం. కాని ఒక డ్రైవింగ్ తెలియని డ్రైవర్ చేతిలో చిక్కిన కారులా కొన్ని విషయాలకే పరిమితమై నడుస్తున్నది. ఇస్లామ్‌లో లేని అనేక దురాచారాలను తలకెత్తుకున్న ముస్లిమ్ సమాజం స్వీయ సంస్కరణల బాటలో నడవవల్సి వున్నది. ఆర్థికాభివృద్ధి కోసం దేబిరించే బదులు 'జకాత్' వ్యవస్థను పటిష్ట పర్చుకోవడం ద్వారా స్వీయ సమృద్ధిని సాధించాలి. మతపరమైన ఉద్రిక్తతలకు తావిచ్చే అంశాలలో అత్యంత వివేకంతో సంయమనం పాటించాలి. ఇంటి గడప దాటకుండా, సామాన్య ముస్లిం ప్రజల కష్టనష్టాలు తెలియకుండా బాధ్యతలేని ప్రకటనలతో ఉద్రేకపూరిత ఉపన్యాసాలు చెప్పే రాజకీయ నాయకులు ముస్లింలకు ఒరగబెట్టిందేమీ లేదు. ముస్లింల డోలయాన స్థితిని ఆసరా చేసుకొని కొన్ని శక్తులు మెజార్టీ సమాజంలో మసిపూసి మారేడు కాయ చేసిన చందంలా ముస్లింల ఉనికి పట్ల భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. తమకు అందుబాటులో వున్న మీడియాద్వారా తమ పట్ల ఇతర సమాజాలలో పెరుగుతున్న అపోహలను, అపార్థాలను తొలగించే కార్యక్రమాన్ని ముస్లిం మేధావులు చేపట్టాలి. స్వయాన ప్రవక్త ముహమ్మద్ (స) మలినాన్ని మలినంతో శుభ్రపర్చలేమని చెప్పారు. మతోన్మాదం, టెర్రరిజం పరస్పర ఆధారితాలు ఈ రెండు వివేక శూన్యమయినవే.

ఇప్పుడు ముస్లిమ్ సమాజం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సమస్య అభద్రతా భావం. ఈ వలయంలో చిక్కి ముస్లిమ్

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

సమాజం విలవిలలాడి పోతున్నది. ముస్లింలు స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి కరువైంది. చివరికి క్రికెట్ కూడా టి.వి.లో అందరితో కలిసి చూడలేని దౌర్భాగ్యపు పరిస్థితులు చుట్టు ముట్టాయి. కొన్ని శక్తులు ఒక పథకం ప్రకారం ముస్లింల దేశభక్తిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. స్వాతంత్ర్య పోరాటంలో ఎనలేని త్యాగాలు చేసిన ముస్లింల చరిత్ర ఉద్దేశ్యపూర్వకంగా విస్మరించబడింది. నిజానికి దేశవిభజన వల్ల ఎక్కువగా నష్టపోయిన వారు భారతీయ ముస్లింలే. భారతీయ ముస్లింలకు దేశ విభజన వల్ల జరిగిన నష్టం అపారమైనది. స్వీయ ప్రయోజనాల కోసం నిత్యం పాకిస్తాన్ పాలకులు అనుసరిస్తున్న దుష్ట వైఖరి భారతీయ ముస్లింలకు పెను శాపంలా మారింది. ఐ.యస్.ఐ. కొనసాగిస్తున్న విధ్వంసకర కార్యక్రమాలతో భారతీయ ముస్లింలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా తదనంతర పరిణామాలకు ముస్లిం సమాజం బలి అవుతున్నది. పరాన్న భుక్కులుగా కాక శ్రమ విలువలతో కూడిన జీవన విధానం కలిగి వున్న ముస్లింలు సామాజిక, ఆర్థిక, సమస్యలతో పాటు అభద్రతాభావాన్ని మోయాల్సి రావడం విచారించదగ్గ విషయం.

వర్తమాన ఆధునిక కాలంలో సమస్యలు పెరిగాయి. ప్రతి సమాజానికీ కొన్ని ప్రత్యేక సమస్యలు వున్నాయి. ఈ పరిస్థితులలో అనేక ఉమ్మడి సమస్యలపై ముస్లిం సమాజం ఇతర సమాజాలతో కల్సి నడవవల్సిన అవసరం వుంది. అయితే అన్ని సమాజాలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ముస్లిం సమాజం అదనపు సమస్యలను ఎదుర్కొంటుంది. ఇలాంటి విచిత్ర పరిస్థితులలో స్వీయ తప్పిదాలను సవరించుకునే వైపుగా అడుగులు పడాలి. ప్రత్యేకమైన భాష, సంస్కృతిని కలిగి వుండటం తప్పుకాదు. కాని ఉర్దూభాష ఇస్లామ్ భాషనే భావ జాలం నుండి బయటపడాలి. తెలుగు లేదా ఇతర స్థానిక భాష మాట్లాడే ముస్లింలను చిన్న చూపు చూడటం మానుకోవాలి. సాంస్కృతిక వైరుధ్యం శృతిమించితే అది విభిన్న సమాజాల మధ్య విభజనకు దారితీస్తుంది. ప్రాంతీయ భాషల్ని సామాన్యీకరణ చేసుకోవడం ద్వారా ముస్లిం సమాజం ఇతర సమాజాలకు దగ్గరవుతుంది. తద్వార ఒకరి సమస్యలు మరొకరు తెల్సుకోవ టానికి వీలవుతుంది. ఒకరి పట్ల మరొకరికి వున్న అనుమానాలు దూరమై ఉమ్మడి సామాజిక ఐక్యత సాధ్యమవుతుంది.

ముస్లింలు తమ మూలాల్ని వెతుక్కోవాల్సిన అవసరం వుంది. సామాజిక స్పృహను కలిగి వుండాలి. పీడక వర్గాలేవో, పీడిత వర్గాలేవో గుర్తించి తమతో సారూప్యమున్న అట్టడుగు బలహీన వర్గాల ప్రజలతో ఐక్యవేదికను నిర్మించుకోవాలి. ఇటీవలి కాలంలో ఈ ప్రయత్నాలు జరుగుతూ వుండటం హర్షించదగ్గ విషయం. ముస్లిం యువత ఇప్పుడు తీవ్రమైన నిరాశ నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడుతుంది. అసంతృప్తి ఆలోచనాత్మకమైన నిర్మాణం వైపుకు కదలాలి, అంతే కాని అవేశపూరితమైన విధానాల వైపుకు కాదు. ప్రజాస్వామ్యబద్ధమైన ప్రగతిశీల, సెక్యులర్ శక్తులతో కలిసి నడుస్తూ విద్యాభివృద్ధి, ఆర్థికాభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరించాలి. తద్వారా మాత్రమే ముస్లిం సమాజం సమస్యల సుడిగుండం నుండి బయట పడగలుగుతుంది. ముస్లింలు ఇప్పుడు పాకులాడాల్సింది గుప్పెడు సానుభూతి కోసం కాదు. ఆత్మవిశ్వాసం కోసం, అచంచలమైన విజయ విశ్వాసం కోసం.

**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**



# పాలస్తీనియన్లకు ప్రియాంక గాంధీ సంఘీభావం
# భారతదేశ చారిత్రక వైఖరికి ప్రతిబింబం

**కాంగ్రెస్** ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తొలిసారిగా ఇటీవలి శీతాకాల పార్లమెంటు సమావేశానికి హాజరయ్యారు. రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా, సభలో తన శక్తివంతమైన ప్రసంగంతో అందరి దృష్టిని ఆకర్షించారు. అయితే, ఆమె పార్లమెంటుకు హాజరైన సమయంలో, సోషల్ మీడియాలో ఒక ఫోటో వైరల్ అయింది. ఆ ఫోటోలో..."పాలస్తీనా" అని రాసి ఉన్న హ్యాండ్‌బ్యాగును ఆమె భుజాన వేసుకుని వచ్చారు. ఆ బ్యాగుపై శాంతిని సూచించే తెల్లటి పావురం, దానిపై ఎర్రటి పుచ్చకాయ ముక్క బొమ్మ ఉంది. ప్రియాంక ఆ సంచితో సభలోకి ప్రవేశించడం సంచలనంగా మారింది. ఈ చిత్రం పాలస్తీనా కోసం కొత్త సందేశంగా నిలిచింది. దీంతో భారత రాజకీయాల్లో పాలస్తీనా అంశం మళ్లీ చర్చనీయాంశమైంది. అధికార పక్షం, అనుకూల పార్టీలు పాలస్తీనా అంశంపై ప్రతికూలంగా స్పందించాయి. బీజేపీ దీన్ని ముస్లింలకు అనుకూలంగా రాజకీయ ఎత్తుగడగా అభివర్ణించగా, చాలా పార్టీలు ప్రియాంక గాంధీ చర్యను ప్రశంసించాయి. ఆమె ఈ ఒక్క అడుగు, పాలస్తీనా పట్ల భారతదేశం అండగా ఉన్నట్లు మళ్లీ స్పష్టం చేసింది.

### పాలస్తీనా పట్ల భారతదేశ చారిత్రక వైఖరి

భారతదేశం 1988లో పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించింది. అప్పటి నుండి, పాలస్తీనా పక్షాన తన మద్దతును ప్రకటిస్తూ వచ్చింది. అయితే, బీజేపీ ప్రభుత్వ హయాంలో ఇజ్రాయెల్‌తో సంబంధాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నప్పటికీ, పాలస్తీనా పట్ల భారతదేశపు చారిత్రక వైఖరి చెక్కుచెదరలేదు. ప్రియాంక గాంధీ పాలస్తీనా పట్ల తన సంఘీభావాన్ని తెలియజేయడం కాంగ్రెస్ సుదీర్ఘ విధానానికి ప్రతీకగా నిలిచింది.

### బంగ్లాదేశ్ మైనారిటీలకు మద్దతు

బంగ్లాదేశ్‌లో మైనారిటీ హక్కుల సమస్యలను బీజేపీ లేవనెత్తగా, ప్రియాంక గాంధీ తనదైన శైలిలో బదులిచ్చారు. మరుసటి రోజు, బంగ్లాదేశ్ మైనారిటీలకు మద్దతుగా, ప్రత్యేక బంగ్లాదేశ్ హ్యాండ్ బ్యాగ్‌తో పార్లమెంటుకు హాజరై, మైనారిటీల పట్ల తన సంఘీభావాన్ని తెలిపారు.

### మానవ హక్కుల పట్ల ప్రియాంక గాంధీ నిబద్ధత

పాలస్తీనా పట్ల ప్రియాంక గాంధీ స్వరం వినిపించడం తొలిసారి కాదు. ఇటీవలి రోజుల్లో, ఆమె పాలస్తీనా రాయబారిని కలుసుకోవడం, గాజాలో ఇజ్రాయెల్ చర్యలను ఖండించడం వంటి చర్యలు తీసుకున్నారు.

ప్రియాంక గాంధీ చర్యలు రాజకీయంగా గమనించదగినవి. రాజకీయాలు కేవలం అధికారం కోసం మాత్రమే కాకుండా, మానవ హక్కుల కోసం జరిగే పోరాటంలో ఒక ముఖ్య భాగమని ఆమె ఈ చర్యల ద్వారా స్పష్టం చేసినట్టుగా తెలుస్తోంది.

**– అన్వర్**

# గొప్ప గురువులే గొప్ప శిష్యులను తయారు చేయగలరు



**డా॥ ముహమ్మద్ హసన్, అసిస్టెంట్ ప్రొఫెసర్**

**"ఉత్తమమైన వ్యక్తిని రూపొందించడమే విద్య పరమార్థం. అది ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుంది.** అలాగే నిరంతరం నేర్చుకునే ఉపాధ్యాయుడే మంచి విద్యావంతులను తయారు చేయగలడు. అందుకే రవీంద్రనాథ్ ఠాగూర్ ఉపాధ్యాయుడిని ఉద్దేశించి "తను జ్వలిస్తూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేవాడే అసలైన ఉపాధ్యాయుడు" అంటాడు. శిల్పి మంచి శిల్పం చెక్కాలంటే ముందుగా తాను చెక్కబోయే రాయి స్వభావం తెలిసి ఉండాలి. అప్పుడు మాత్రమే అతను మంచి శిల్పాన్ని చెక్కగలుగుతాడు. అలాగే ఉపాధ్యాయుడికి విషయపరంగా ఎంతో జ్ఞానం ఉన్నప్పటికీ తన దగ్గర చదువుకునే పిల్లలను ప్రయోజకులుగా మార్చాలంటే వారి స్వభావాన్ని, మనస్తత్వానికి సంబంధించిన అవగాహన చాలా అవసరం. పిల్లలు భిన్న సామాజిక నేపథ్యాల నుంచి పాఠశాలకు వస్తారు. ఏ ఇద్దరి పిల్లల ప్రవర్తన ఒకే రీతిగా ఉండదు. పిల్లలు తరగతి గదిలో ప్రవర్తించే తీరు, వారికున్న సహజ సామర్థ్యాలు, ఆసక్తులు, వైఖరులు మొదలైనవన్ని భిన్నంగా ఉంటాయి. అలాగే వారు విద్యను అభ్యసించే విధానాలు కూడా భిన్నంగా ఉంటాయి. అందుకే జాన్ డ్యూయి అనే విద్యావేత్త "తరగతి గదిని చిన్నపాటి సమాజంగా" పరిగణిస్తాడు.

ఉపాధ్యాయులుగా మనం తరగతి గదిలో బోధించే విషయాల పట్ల పిల్లలందర్నీ ప్రేరేపించి వారిని అభ్యాసనకు సంసిద్ధులను చేయవలసి ఉంటుంది. పిల్లలు అందరు ఆశించిన స్థాయిలో నేర్చుకోవాలంటే వారి తరగతి, వయస్సు, స్థాయి, పరిపక్వత, సంసిద్ధత మొదలైన వాటిని దృష్టియందుంచుకొని ఉపాధ్యాయులుగా బోధనా విషయాలను, అభ్యాసనా ప్రక్రియలను, బోధనోపకరణాలను, కృత్యాలను రూపొందించుకొని తరగతి గదిలోకి వెళ్ళాల్సి ఉంటుంది. కాబట్టి ఉపాధ్యాయునికి కేవలం విషయ పరిజ్ఞానం మాత్రమే కాకుండా పిల్లలకు సంబంధించిన అలవాట్లపై అలాగే వర్తమాన, సామాజిక అంశాలపై కూడా అవగాహన ఉండటం ఎంతైన అవసరం.

మనిషి జీవితంలో పుట్టుక నుంచి ఎన్నో మార్పులు జరగడం మనం గమనిస్తాం. వ్యక్తి జీవితం ఊపిరి పోసుకోవడంతో ప్రారంభమై నిరంతరం వికాసం చెందుతాడు. మనిషి వికాసంలో జరిగే మార్పులను కొన్నింటిని మాత్రమే ప్రత్యక్షంగా కంటితో చూడగలం. మిగతా మార్పులన్నీ అంతర్గతంగా జరుగుతాయి. అంటే ఈ మార్పులు పరిమాణాత్మకంగా, గుణాత్మకంగా ఉంటాయి. వీటిని పెరుగుదల, వికాసాలుగా చెప్పవచ్చు. ఎదుగుదలను ప్రత్యక్షంగా చూడవచ్చును, కాని వికాసాన్ని మనం వయస్సుతో పాటు అభ్యాసనా సామర్థ్యాలను బట్టి మాత్రమే అంచనా వేయగలం.

పిల్లల పెరుగుదల వికాసాలు ఎలా జరుగుతాయి? ఏఏ దశలలో ఏ రకమైన మార్పులు సంభవిస్తాయి? సమగ్ర వికాసానికి తోడ్పడే కారకాలేమిటి? వివిధ దశలలోని వికాసాల వేగం, ధోరణి నమూనా లేమిటి? పిల్లల నుండి ఏ దశలో ఏమి ఆశించవచ్చు? వారిలో అభిలషణీయమైన వికాసం జరగాలంటే ఎలాంటి పరిసరాలు కల్పించాలి? వంటి అంశాలను ఉపాధ్యాయులు తెలుసుకోవాలి. ఈ అంశాల అవగాహన వల్ల ఉపాధ్యాయులు సరైన వికాసాభివృద్ధి కలగడానికి సముచితమైన పాఠ్యప్రణాళికను రూపొందించుకొని, సరైన మార్గదర్శకత్వం అందించి, పిల్లల సంపూర్ణ వికాసానికి తోడ్పడాలి.

ఆధునిక విద్యావేత్తలు అనేక పరిశోధనలు చేసి పిల్లలందరిలోను అభ్యసించే శక్తిసామర్థ్యాలు, సహజసామర్థ్యాలు ఉన్నాయని నిరూపించారు. దీని ప్రకారం పిల్లలు స్వతంత్రంగా జ్ఞానాన్ని నిర్మించుకోగలరు (Knowledge Construction) ముఖ్యంగా పిల్లలకు సమాచారాన్ని అందుబాటులో ఉంచి వారి పూర్వజ్ఞానం, పూర్వానుభావాలతో జ్ఞానాన్ని నిర్మించుకొనేందుకు ఉపాధ్యాయులు సంధానకర్త, సౌలభ్యకర్తలుగా (Facilitators) ఉండాలి.

"అభ్యసనం" అనేది పరిసరాలలో పరస్పర ప్రతిస్పందనల ద్వారా, పరిశీలన ద్వారా, సమాజంలోని వ్యక్తులతో జరిపే చర్చల ద్వారా జరుగుతుంది. అంటే పిల్లలు తమకున్న పూర్వజ్ఞానం ద్వారా కొత్త జ్ఞానం పొందడానికి ప్రయత్నిస్తారు. జ్ఞాన నిర్మాణం అనేది పిల్లలు సొంతంగా పరిసరాలతో, వ్యక్తులతో జరిపే పరస్పర చర్య, ప్రతి స్పందనల ద్వారా జరుగుతుంది. పిల్లల్లో పూర్వజ్ఞానం వేరుగా ఉంటుంది. కాబట్టి కొత్త అంశాలను అవగాహన చేసుకోవడం కూడా వేరుగా ఉంటుంది. పిల్లలు తమ అభ్యసనంలో ఒకే స్థాయిలో ఉండరు. పిల్లల జ్ఞాన నిర్మాణానికి, తగిన అనుభవాలు, కృత్యాలు, చర్చల ద్వారా ఆలోచింపచేయటం అవసరం. అలాగే అభ్యసనం ఎల్లప్పుడు తెలిసిన విషయాల నుండి తెలియని విషయాలకు, సాధారణం నుండి ప్రత్యేకమైన అంశాలకు, మూర్తమైన అంశాల నుండి అమూర్తమైన విషయాల వైపు, సులభం నుండి కఠినం వైపు మళ్ళించేదిగా ఉండాలని నిపుణులు సూచించారు. అందులో భాగంగానే విద్యా ప్రణాళిక, (Curricullum), పాఠ్య ప్రణాళికలను (Lesson Plans) వీటికి అనుగుణంగా తయారుచేసి విద్యార్థులకు పాఠ్యాంశాల పట్ల శ్రద్ధ పెరిగేలా చేయాలి.

పిల్లలే ఊహించడం, ప్రకల్పనలు చేయడం, అన్వేషించడం, ప్రశ్నించడం, చర్చించడం, సిద్ధాంతీకరణం చేయడం, ప్రతిస్పందించడం, సమూహాలలో కలిసి పనిచేయడం మొదలైన కీలకపాత్ర పోషిస్తారు. పిల్లలు అభ్యాసనలో స్వయంగా పాల్గొని జ్ఞానాన్ని నిర్మించే క్రమంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైంది. నేర్చుకునే విద్యార్థి తనకు తానుగా అన్ని అభ్యాసనా కార్యక్రమాలలో పాల్గొంటూ జ్ఞాన నిర్మాణం చేసుకొంటాడు. బడిలో నేర్చుకొన్న దాన్ని బయటి అనుభవాలతో అన్వయించు కొని, అవగాహన పెంచుకుంటాడు. పూర్వ అనుభవాల నుంచి, ప్రసారమాధ్యమాల నుంచి కొత్త ఆలోచనలు అభివృద్ధిపరచుకొని పాఠశాల బయట, ఇంటిలో, సమాజంలోని విషయాల ద్వారా తమకుతామే అభ్యసించే సామర్థ్యాన్ని పెంపొందించుకోగలుగుతారు.

ఉపాధ్యాయుడికి తల్లీ, తండ్రీ తర్వాత "గురువు"కు ఉన్నతమైన స్థానం ఇవ్వడం జరిగింది. అంతటి స్థానం వున్న గురువుకి ఆ స్థానం విలువను నిలబెట్టుకోవడానికి ఎంతో క్రమశిక్షణ, వృత్తి పట్ల నిబద్ధత, పిల్లల్ని వారి అభిరుచులకనుగుణంగా తరగతి గదిని ఎప్పటికప్పుడు సంసిద్ధం చేయాల్సిన ప్రధాన బాధ్యత ఉపాధ్యాయుడిదే. అలాంటి ఉపాధ్యాయుడే ఉత్తమ (ఆదర్శ) ఉపాధ్యాయుడిగా భావించాల్సి వుంటుంది. తెల్ల కాగితంలాగా ఉత్తమ విలువలతో పిల్లల్ని అభ్యాసన పట్ల సంసిద్ధులను చేస్తే వారే గొప్ప వ్యక్తులుగా తయారు కాగలరు. లేనిపక్షంలో ఇటీవలే అనంతపురం జిల్లా రాయచోటిలో "ఏజాజ్" అనే ఉపాధ్యాయుడు విద్యార్థుల దాడికి గురై మరణించిన సంఘటన, అదేవిధంగా బీహార్‌లో స్కూల్ ప్రిన్సిపాల్‌ను ఓ విద్యార్థి కాల్చి చంపిన మరో సంఘటన మనకు తెలిసిందే. అలాగే ఉత్తర్‌ప్రదేశ్‌లోని బహ్రాయిచ్ జిల్లా మిహిన్ పుర్వాలో నవయుగ్ ఇంటర్ కళాశాలకు చెందిన 11వ తరగతి విద్యార్థి క్లాస్ టీచరుపై కత్తితో దాడిచేసిన సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ సంఘటనల్లో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కూడా తప్పు పట్టాల్సిందే. పిల్లవాడి అసహజమైన ప్రవర్తనకు లేదా అసాధారణమైన ప్రవర్తనకు తల్లిదండ్రులు కూడా బాధ్యులే "దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుంది" అన్న కొఠారి కమీషన్ సిఫార్సులు ఎంత విలువైనవో అలాంటి తరగతి గదిని ఎంతలా సద్వినియోగం చేసుకున్నాం అన్నదానిపైనే విద్యార్థి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అలాగే "తరగతి గది" వాతావరణాన్ని పిల్లలకు ఎలా ఉపయోగపడేలా చేశామనేది కూడా ఉపాధ్యాయులుగా మనల్ని మనం ప్రశ్నించుకోవలసిన అంశం.

అభ్యసించిన విద్యను ఎవరు ఎలా ఉపయోగించుకున్నారనేది కూడా ఇక్కడ మనం గమనించాల్సిన మరో అంశం, అలాగే తరగతి గదిలో కుల వివక్షకు గురైన భీమ్ రావు అదే తరగతి గదిలో ఉపాధ్యాయుడి ప్రేమకు దగ్గరై ప్రపంచ మేధావుల జాబితాలో పేరు సంపాదించి, భారత రాజ్యాంగాన్ని రచించి తన ఎదుగుదలకు దోహదపడ్డ గురువుకు దక్షిణగా పేరులోనే అంబేద్కర్ ను చేర్చుకున్న గొప్ప వ్యక్తి రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్. అందుకే గొప్ప గురువులే గొప్ప గొప్ప శిష్యులను తయారుచేయగలరు.




## ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా ముహమ్మద్ అసదుల్లా

ఉర్దూ అకాడమీ కొత్త డైరెక్టర్‌గా, సెక్రటరీగా ముహమ్మద్ అసదుల్లాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా వ్యవహరిస్తున్న అసదుల్లాకు డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. డిసెంబర్ 31న అసదుల్లా బాధ్యతలు స్వీకరించారు.

## ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు చైర్మన్ గా అబ్దుల్ అజీజ్

ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు చైర్మన్ గా అబ్దుల్ అజీజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అయ్యారు. అనంతరం అబ్దుల్ అజీజ్ మీడియాతో మాట్లాడుతూ.. 'దేవుడి ఆస్తులను కాపాడే బాధ్యత ఇస్తున్నాను జాగ్రత్తగా కాపాడు అని చంద్రబాబు చెప్పారు. వక్ఫ్ బోర్డ్ స్తంభించడం వల్ల అనేక రోజుల నుంచి నిర్ణయాలు తీసుకోలేకపోయారు. కూటమి ప్రభుత్వంలో నూతన బోర్డుతో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోబోతున్నాం' అన్నారు. విజయవాడ లోని వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎన్నిక కోసం బోర్డ్ సభ్యులలో ఒకరైన ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీం అన్సారియ వక్ఫ్ చైర్మన్ ఎన్నిక నిర్వహణ అధ్యక్షత వహించి, ఎన్నికల ప్రక్రియ ను నిర్వహించారు. సభ్యులలో ఒకరైన నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ను ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

## హైదరాబాద్ ఓల్డ్ సిటీకి మెట్రో రైలు

హైదరాబాద్‌లో మెట్రో రైలు రెండో దశ పనులు త్వరగా ప్రారంభించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే.. రెండో దశలో భాగమైన పాతబస్తీ రహదారి మార్గంలో రహదారి విస్తరణకు కూడా ఆస్తుల సేకరణను అధికారులు మొదలుపెట్టేశారు మెట్రో కోసం, రహదారి విస్తరణ కోసం ముందుకొచ్చే నిర్వాసితులకు త్వరలోనే పరిహారం కింద చెక్కులు కూడా అందజేయనున్నట్టు చెప్పు కొచ్చారు. ఈ ప్రక్రియ ఎంత త్వరగా పూర్తయితే.. అంతే త్వరగా ఆస్తుల కూల్చివేత, రహదారి విస్తరణ పనుల ప్రక్రియ మొదలుపెడతామని ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. ఎంజీబీఎస్-చాంద్రాయణ గుట్ట మార్గంలో 7.5 కి.మీ.మేర ఈ మెట్రో రైలు పరుగెత్తనుంది.

## సైబర్ నేరాలకు వేదికగా వాట్సాప్

సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు సైబర్ నేరాలకు వేదికలుగా మారాయి. వాట్సాప్ కేంద్రంగా సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్ తర్వాత స్థానంలో టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ ఉన్నాయి. 2023-24 సంవత్సరంలో నమోదైన సైబర్ నేరాల జాబితాను కేంద్ర హోంశాఖ తాజాగా విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం.. గతేడాది మొదటి మూడు నెలల్లో వాట్సాప్ ద్వారా జరిగిన సైబర్ మోసాలపై 43,937 ఫిర్యాదులు రాగా, టెలిగ్రామ్‌లో మోసాలపై 22,680, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా జరుగుతున్న నేరాలపై 19,800 చొప్పున నమోదయ్యాయి. ఈ నేరాలకు పాల్పడేందుకు సైబర్ మోసగాళ్లు గూగుల్ సేవల ప్లాట్‌ఫాంలను ఉపయోగిస్తున్నారు.

## అవి పూర్తిగా ద్వేషపూరిత వ్యాఖ్యలు!

కేరళను 'మినీ పాకిస్తాన్' అంటూ మహారాష్ట్ర మంత్రి నితీష్ రాణే చేసిన వ్యాఖ్యలపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సహా పాలక ఫ్రంట్ నేతలు తీవ్రంగా ఖండించారు ఈ వ్యాఖ్య 'పూర్తిగా ద్వేషపూరితమైనదని, 'తీవ్రంగా ఖండించదగినదని విజయన్ విమర్శించారు. "లౌకికవాదం, మత సామరస్యానికి కంచుకోట అయిన కేరళకు వ్యతిరేకంగా సంఘ్ పరివార్ నిర్వహించే విద్వేష ప్రచారాలను ఈ వ్యాఖ్య ప్రతిబింబిస్తోంది. మతం పేరుతో ప్రజలను విభజించాలన్న సంఘపరివార్ వ్యూహం దీంతో బట్టబయలవుతోంది. కేరళపై జరిగిన ఈ హేయమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాము. సంఘ్ పరివార్ ద్వేషపూరిత ప్రచారానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, లౌకిక శక్తులన్నీ ఏకం కావాలి." అని ఎక్స్‌లో పెట్టిన పోస్టులో పేర్కొన్నారు. నితీష్ రాణె ఫడ్నవీస్ ప్రభుత్వంలో మత్స్య, ఓడరేవుల అభివృద్ధి శాఖలను నిర్వహిస్తున్నారు. ఒక బహిరంగ సభలో కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలను ఉద్దేశించి నితీష్ రాణె మాట్లాడుతూ, కేరళ మినీ పాకిస్తాన్ అయినందునే వయనాడ్ నుండి వారిద్దరూ ఎంపిలుగా ఎన్నికయ్యారని వ్యాఖ్యానించారు.




## 124 ఏళ్లలో అత్యంత వేడి సంవత్సరంగా 2024

ప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ముగిశాయి. అన్ని దేశాల ప్రజలు 2024కు గుడ్‌బై చెప్పి 2025లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా వాతావరణ కేంద్రం 2024 సంవత్సరానికి సంబంధించి ఓ కీలక విషయం చెప్పింది. 1901 నుంచి గడిచిన 124 ఏళ్లలో 2024 అత్యంత వేడి సంవత్సరంగా నిలిచిందని వెల్లడించింది. 2024లో నేలపై కనిష్ఠ ఉష్ణోగ్రతల సగటు సాధారణ సగటు కంటే 0.65 డిగ్రీ సెల్సియస్ ఎక్కువగా ఉందని పేర్కొంది. 1901 నుంచి 2020 వరకు నమోదైన దీర్ఘకాలిక సగటు కంటే ఇది చాలా ఎక్కువని భారత వాతావరణ కేంద్రం డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మొహపాత్ర తెలిపారు. అందుకే 2024 ఏడాది గత 124 ఏళ్లలో అత్యంత వేడి సంవత్సరంగా నిలిచిందని అన్నారు. దాంతో ఇప్పటివరకు అత్యంత వేడి సంవత్సరంగా నమోదై ఉన్న 2016 రెండో స్థానానికి వెళ్లిపోయిందని చెప్పారు. 2016లో నేలపై సాధారణ కనిష్ఠ సగటు ఉష్ణోగ్రత కంటే 0.54 సెల్సియస్ ఎక్కువగా నమోదైందని అన్నారు. వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్, క్లైమేట్ సెంట్రల్ అనే రెండు వాతావరణ శాస్త్రవేత్తల బృందాలు ప్రతి ఏడాది ఉష్ణోగ్రత రిపోర్టులు అందిస్తాయి. 2024లో మొత్తం 41 కిపైగా రోజులు ప్రమాదకరమైన వేడి కలిగిన రోజులుగా రికార్డయ్యాయని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

## 2024 పిల్లల పాలిట పెనుశాపమే

పిల్లల పాలిట చరిత్రలో ఎన్నడూ లేనంతగా దారుణ సంవత్సరంగా నిలిచింది 2024 సంవత్సరం. యుద్ధాలు, ఘర్షణల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా పిల్లలు భారీ సంఖ్యలో నిరాశ్రయులయ్యారు. ఏకంగా 47.3కోట్ల మంది బాలలు సంఘర్షణ ప్రాంతాల్లో నివసిస్తు న్నారు. ఆరుగురిలో ఒకరికంటే ఎక్కువ మంది కల్లోల ప్రాంతాల్లో నివసిస్తున్నారు. చదువు మాట అటుంచి వారికి పోషకాహారమే గగనమైపోయింది. గాజా, సూడాన్, ఉక్రెయిన్, సహా ప్రపంచ వ్యాప్తంగా ఘర్షణలతో సతమతమవుతున్నట్లు ఐరాస బాలల సంస్థ యూనిసెఫ్ తాజాగా పేర్కొంది. గాజాపై ఇజ్రాయిల్ దాడుల్లో 15నెలల్లో కనీసం 17,492 మంది బాలలు మరణిం చినట్లు తెలిపింది. పాఠశాలలపై బాంబుల వర్షం కురుస్తోంది. ఇళ్లు ధ్వంసమవుతున్నాయి. కుటుంబాలు ఛిన్నాభిన్నమయ్యాయి.

### గాజాలో ఆస్పత్రులపై దాడులు ఆపండి

గాజాలో ఆస్పత్రులపై దాడులను ఆపాల్సిందిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అదనామ్ గెబ్రెయెసెస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. గత కొద్ది రోజులుగా ఒక దాని తర్వాత మరొకటి వరుసగా ఆస్పత్రులపై దాడులు చేస్తూ విధ్వంసాన్ని సృష్టించడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత వారంలో ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ ఆస్పత్రిపై ఇజ్రాయిల్ సైన్యం వరుస దాడులకు దిగి, మెజారిటీ భాగాన్ని అగ్నికి ఆహుతి చేసింది. ఆస్పత్రులన్నీ కదన రంగాలుగా మారాయని, ఆరోగ్య వ్యవస్థ తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందని గెబ్రెయెసెస్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ప్రస్తుతమున్న తరుణంలో గాజా ప్రజలకు పూర్తి స్థాయిలో ఆరోగ్య సంరక్షణ వుండాలని ఆయన పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన మానవతా సాయం కూడా అందించాల్సి వుందన్నారు. తక్షణమే కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చు కోవాలన్నారు. డబ్ల్యూహెచ్‌ఓ, ఇతర భాగస్వాములతో కలిసి గాజా ప్రజలకు మౌలికంగా అవసరమైన వైద్య సరఫరాలు, ఆహారం, తాగు నీరు వంటివి సరఫరా చేస్తోందని, కానీ ఇజ్రాయిల్ తన దాడులతో వాటిని అడ్డుకుంటోందని విమర్శించారు. కమల్ అద్వాన్ ఆస్పత్రిపై దాడి చేసి అదుపులోకి తీసుకున్న డైరెక్టర్ హుస్సేన్ అబూ సఫియాను ఆర్మీ స్థావరంలో వుంచినట్లు మీడియా వార్తలు తెలిపాయి. మరోవైపు గాజాలో గత 24గంటల్లో 27మంది పాలస్తీనియన్లు మరణించగా, 149మంది గాయపడ్డారు. అత్యంత శీతల గాలులతో నెల రోజుల బాలుడు గాజాలోని అల్ అక్సా ఆస్పత్రిలో కన్నుమూసింది. అంతకు ముందు రోజే ఆ బాలుడి కవల సోదరుడు ఇదే కారణంతో చనిపోయాడని మీడియా వార్తలు తెలిపాయి. ఇప్పటివరకు చలి కారణంగా గాజాలో ఆరుగురు శిశువులు మరణించారు. ఒక వృద్ధుడు కూడా కన్నుమూశాడని అధికారులు తెలిపారు. మానవతా సాయం రవాణా చేస్తున్న ట్రక్కుల విషయంలో సరైన ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ప్రపంచ ఆహార కార్యక్రమాన్ని గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం విమర్శించింది. ట్రక్కలకు సరైన ఎస్కార్టు వుండడం లేదని, వాటి గురించి సమాచారం కూడా అందుబాటులో వుండడం లేదని విమర్శించింది. ఇదంతా డబ్ల్యూఎఫ్‌పీ నిర్వహణా వైఫల్యమని వ్యాఖ్యానించింది.

# కోపాన్ని జయించి చూడు!

ముహమ్మద్ వహీదుద్దీన్

ఒక వ్యక్తి.. ముహమ్మద్ (స) దగ్గరికి వచ్చి "నాకు ఏదైనా ఉపదేశించండి" అని అర్థించాడు. దానికి ప్రవక్త(స) "కోపగించు కోకు" అని బోధించారు. ఆ వ్యక్తి దాని తరువాత కూడా మాటిమాటికీ "నాకు ఏదైనా ఉపదేశించండి"అని అర్థించసాగాడు. అతను అలా అడిగిన ప్రతిసారీ ప్రవక్త (స) "కోపగించుకోకు" అనే బోధించారు.

కోపం అనేక రకాల అక్రమాలు, నిషిద్ధాలు, అవిధేయతకు కారణం అవుతుంది. తిట్లు, కొట్లాటలు, చంపుకోవడం, దౌర్జన్యాలు, మనస్పర్థలు... భార్యభర్తల మధ్య విడాకుల వరకు పురిగొల్పుతాయి.

కోపతాపాలను విడనాడినట్లయితే మంచి లక్షణాలు, ఉత్తమ గుణాలు అలవాటు అవుతాయి. ఒకసారి హజ్రత్ అబ్దుల్లా బిన్ ముబారక్ (రజి)తో మంచి గుణాలు, ఉన్నత లక్షణాలు ఎలా అలవాటు అవుతాయని ప్రశ్నించారట ఒకరు. దానికి ఆయన "కోపతాపాలను విడనాడండి" అని సమాధాన మిచ్చారు. ప్రతి మనిషీ కోపానికి దూరంగా ఉండాలి. ఎప్పుడైనా కోపం వచ్చినా... దానిని దిగమింగాలి. కోపాన్ని దిగమింగే విషయమై మహనీయ ప్రవక్త (స).. ఇలా తెలిపారు.

"కోపం వచ్చినప్పుడు అవుజుబిల్లాహి మినష్ షైతానిర్రజీమ్" అని పఠించాలి. మనిషి నిలబడి ఉన్నప్పుడు కోపం వస్తే కూర్చోవాలి. కూర్చున్నప్పుడు కోపం వస్తే పడుకోవాలి" అని తెలిపారు. (హదీస్ గ్రంథం : మిష్కాత్)

కోపం షైతాన్ ప్రభావం వల్ల వస్తుంది. షైతాన్ అగ్ని నుంచి వచ్చాడు. నిప్పు నీటితోనే చల్లారుతోంది. అందుకే కోపం వచ్చినప్పుడు వెంటనే వుజూ చేయాలి. (అబూదావూద్)

"ఎవరు తన నోటిని రక్షించుకుంటాడో... అల్లాహ్ అతని లోటుపాట్లను కప్పిపుచ్చుతాడు. ఎవరు తన కోపాన్ని నిగ్రహించుకుంటాడో అల్లాహ్ ప్రళయ దినాన అతని బాధను పూర్తిగా తొలగిస్తాడు" (హదీస్ గ్రంథం : మిష్కాత్)

"విశ్వాసానికి అంతర్గతమైన మూడే గుణాలున్నాయి. ఒకటి... మనిషికి కోపం వచ్చినా అది అతణ్ణి ఎట్టి అధర్మ కార్యానికి పురికొల్పదు. రెండోది... అతనికి సంతోషం కలిగినప్పుడు ఆ సంతోషం అతణ్ణి సత్యానికి దూరం చెయ్యదు. మూడోది, శక్తి ఉన్నప్పటికీ తనకు చెందని, తనవి కాని వస్తువుల్ని అతను దోచుకోడు" అన్నారు మహా ప్రవక్త (స).

కోపంపై అదుపు సాధించడానికి కోపం వచ్చినప్పుడు.. మౌనాన్ని లేదా నిశ్శబ్దాన్ని పాటించాలి. లేదంటే... కలిగే నష్టానికి ఎంతో మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు మహా ప్రవక్త (స).

మనకందరికీ కోపం నుంచి దూరంగా, ప్రశాంతంగా, శాంతి పూర్వంగా మంచి పనులు చేసేవాడిగా జ్ఞానం ప్రసాదించాలని దైవంతో వేడుకుందాం.

తుదిగేటు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**